తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం అసిఫాబాద్
మహబూబాబాద్

మంగళవారం
19 ఆగస్టు 2025

పేజీలు : 08







## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 18 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నస్పూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన సుందిళ్ల నరేందర్, సుందిళ్ల రాజమ్మ, సుందిళ్ల సులోచన లు తమ కుటుంబ పెద్ద పేరిట నస్పూర్ శివారులో గల భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకొని బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం పెద్దనపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన సఫియా, అబ్దుల్ బి తాము ప్రభుత్వ జి.ఓ.59 ప్రకారం తమ భూమి క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసుకుని, ప్రభుత్వ రుసుము చెల్లించామని, పట్టా మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి, సుబ్బారావు పల్లి గ్రామానికి చెందిన హనుమాండ్లు తమ కుటుంబం గత 50 సంవత్సరాలుగా మిగతా 8లో..

## క్రెచ్ కేంద్రంలో పిల్లల సంరక్షణ

- పల్నా పథకం ద్వారా జిల్లాలో 25 డే-కేర్/క్రెచ్ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు
- రాష్ట్రంలో మొదటిసారిగా ములుగు జిల్లా లోని జగ్గన్నపేట గ్రామం లో క్రెచ్ కేంద్రం ఏర్పాటు
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, ఆగస్టు 18(జనంసాక్షి) :** క్రెచ్ కేంద్రాలు పిల్లల సంరక్షణ సేవలను అందించేందుకు, పగటిపూట తమ పిల్లలను చూసుకోలేని తల్లిదండ్రులు ఇట్టి కేంద్రాలను ఉపయోగించుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం ములుగు మండలం జగన్నపేట గ్రామంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి అంగన్వాడీ, డే కేర్ కేంద్రం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం అంచనా 15 లక్షల నిధులతో అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, సరైన క్రెచ్ కేంద్రాలు లేకపోవడం తో తరచుగా, మహిళలు బయటకు వెళ్లి పని చేయడానికి ఇబ్బందిగా మారిపోయిందని, తమ పిల్లలకు సరైన పిల్లల సంరక్షణ మరియు రక్షణ కల్పించడంలో పనిచేసే తల్లులు ఎదుర్కొంటున్న ఈ ఇబ్బందులను పరిష్కరించడానికి, పల్నా పథకం ద్వారా డే-కేర్/క్రష్ కేంద్రాలు ఉపయోగపడుతాయని తెలిపారు. 7 నెలల నుండి 3 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు సురక్షితమైన వాతావరణంలో నాణ్యమైన క్రెచ్ సౌకర్యాలను అందించబడుతాయని పోషకాహారం, పిల్లల ఆరోగ్యం, పెరుగుదల పర్యవేక్షణ వంటి సేవలు డే-కేర్/క్రెచ్ కేంద్రాలు అందిస్తాయని తెలిపారు. ములుగు జిల్లా లో ములుగు, తాడ్వాయి, ఏటూరునాగారం వెంకటాపురం (04) ఐసిడిఎస్ ప్రోజెక్టుల పరిధిలో పల్నా పథకం ద్వారా 25 డే-కేర్/క్రెచ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, తల్లి తండ్రులు ఈ కేంద్రాలను ఉపయోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జాయింట్ డైరెక్టర్, మహిళా, శిశు సంక్షేమ శాఖ హైదరాబాద్ వినోద్, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా సంక్షేమ అధికారి టి రవి, తెలంగాణ స్టేట్ లీడర్ మొబైల్ క్రెచ్ మాణికప్ప, ప్రోగ్రాం ఆఫీసర్ మొబైల్ క్రెచ్, రాంప్రసాద్, సీడీపీఓ ములుగు కె శిరీష, ఐసిడిఎస్ సూపర్ వైజర్, అంగన్వాడీ టీచర్స్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే విద్యా సంవత్సరం నుండి గిరిజన పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్

- గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 18 ( జనం సాక్షి ) :** వచ్చే విద్యా సంవత్సరం నుండి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేయనున్నట్లు,వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగ తులు ప్రారంభించనున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి తనిఖీ చేశారు.పాఠశాల పరిసరాలను పరిశీలిం చారు. పాఠశాల ఆవరణలో ఉన్న గడ్డి, చెట్ల పొదలను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల భవనాలను, వాటర్ ప్లాంట్, కిచెన్ పరిసరాలను, విద్యార్థులను భోజనాలను పరిశీ లించారు. అనంతరం కడియం శ్రీహరి క్లాస్ రూమ్ లో ఉన్న విద్యార్థుల తో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా,క్లాసులు సరిగా జరుగుతున్నా యా అనేవివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంత రం ఐటిడీఏ పివోకి ఫోన్ చేసి స్టేషన్ ఘనపూర్ గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేయాలనీ అందుకు సంబందించిన ప్రతిపా దనలు ప్రభుత్వానికి పంపించాలని కడియం శ్రీహరి సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుండే జూని యర్ కళాశాల ప్రారంభం కావాలని అన్నారు.జూనియర్ కళాశాల నిర్వహణకు అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి,వైస్ చైర్మన్ ఐలయ్య, డిటిడిఓ ప్రేమకళ, తాహసిల్దార్ వెంకటేశ్వర్లు,ఎంపీడీవో విజయ శ్రీ, ఎంఈఓ కొమురయ్య, గిరిజన ఆశ్రమ పాఠ శాల ప్రధానోపాధ్యాయుడు ధరావత్ రాజు, నాయకు లు శిరీష్ రెడ్డి,చింతకుంట్ల నరేందర్ రెడ్డి,నీల గట్టయ్య, బూర్ల శంకర్,రాజేష్ నాయక్,భూక్యా రమేష్ నాయక్, స్వామి నాయక్, నాగరబోయిన శ్రీరాములు, పోలపల్లి రంజిత్ రెడ్డి, చింత ఎల్లయ్య, జీడి రమేష్, యాకూబ్ పాషా, తెల్లాకుల రామకృష్ణ, కొర్ర వెంకటేష్ నాయక్, భూక్య శ్రీనివాస్, వెంకటేష్,యాట అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**మహబూబాబాద్ బ్యూరో, ఆగస్టు 18(జనం సాక్షి):** సోమవారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పట్టణంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చికిత్స పొందుతున్న పేషెంట్లతో స్వయంగా మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, విష జ్వరాలు, తదితర సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన విధంగా వైద్య సేవలు అందించాలని, ప్రధాన ఆస్పత్రిలోని పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పేషెంట్లకు డైట్ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. విభాగాల వారీగా షెడ్యూల్ ప్రకారం వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిలో అత్యవసర సేవలతో పాటు కావలసిన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, డిఐసిఈ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, సబ్ సెంటర్స్ వారిగా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని క్షేత్రస్థాయిలో విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీరాజ్, మున్సిపల్, అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అవసరం ఉన్నచోట వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ ఉన్నారు.

## శ్రావణమాస చివరి సోమవారం భక్తుల రద్దీ



**కాళేశ్వరం , ఆగస్టు19 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాస చివరి సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఒకవైపు భారీ వర్షం కురుస్తున్న భక్తులు లెక్కచేయకుండా నదిలో స్నానమాచరించి కాళేశ్వర ముక్తేశ్వర స్వామి కి అభిషేకాలు నిర్వహించారు. త్రివేణి సంగమానికి గోదావరి ప్రాణహిత నదుల వరద పోటెట్టడంతో నదీ ప్రవాహం అధికంగా ఉంది. దీంతో భక్తులు లోపలికి వెళ్లకుండా అధికారులు, పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం నీటిమట్టం 9 మీటర్లు గా నమోదయింది. రాష్ట్రమంతా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నది ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. అలాగే ఆలయం ను జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు దర్శించుకుని స్వామి వారికి అభిషేకం, అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి శేష వస్త్రాలతో ఆయనను ఆశీర్వదించి తీర్థ ప్రసాదం అందజేసారు.

## వెంకటాపురం పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ

- ఏఎస్పి శివం ఉపాధ్యాయ ఐపిఎస్



**నూగూర్ వెంకటాపురం ఆగస్టు18(జనంసాక్షి):** ములుగు జిల్లా వెంకటాపురం మండలకేంద్రంలో సోమవారం పోలీస్ స్టేషన్‌ను ఏ ఎస్పి శివం ఉపాధ్యాయ ఐపిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది పని తీరు, రికార్డుల నిర్వహణపై సమీక్షా నిర్వహించడం జరిగింది. మావోయిస్టు కదలికలపై అప్రమత్తం గా ఉండాలని ఏఎస్పి శివం ఉపాధ్యా య ఐపిఎస్ అన్నారు. భారీ వర్షాలు కారణం గావెంకటాపురం మండలం లోని ప్రజలు అప్రమత్తం గా ఉండాలని అన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దు అని అన్నారు. ఈకార్యక్రమంలో సిఐ ముత్యం రమేష్, ఎస్సైకె తిరుపతి ప్రోబసినరి ఎస్సై తిరుపతి రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద విగ్రహానికి విరాళం అందించాలి



**రాయపర్తి,ఆగస్టు 18 (జనంసాక్షి):** మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే స్వామి వివేకానంద విగ్రహానికి విరాళం అందించాల్సిందిగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరపాటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత సమాజంలో మంచి పనులు చేస్తూ ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాట్రపల్లి గ్రామ తాజామాజీ సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య, స్వామి వివేకానంద యూత్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ముద్రబోయిన శ్రీనివాస్,క్యాషియర్ అందే వెంకట మల్లయ్య,కార్యదర్శి బెల్లి నాగరాజు, కోశాధికారి చేనబోయిన సురేష్,సభ్యులు చెనబోయిన రాజు,శ్రీనివాస్, సాగర్,దిలీప్,మహేష్,కత్తి రవి,సుధాకర్,శరత్,కొత్తపల్లి రఘు,పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించవద్దు

- అట్టి భూమిలో హెల్త్ సెంటర్ నే నిర్మించాలి
- జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 18 (జనంసాక్షి):** మండలంలోని కృష్ణాజిగూడెంగ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ స్థలలో కుల సంఘాలకు చెందిన కమ్యూనిటీ హాల్ నిర్మించవద్దని, గతంలో కేటాయించిన విధంగా ప్రభుత్వ స్థలంలో హెల్త్ సెంటర్ నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాదం రాజేందర్,సిపిఎం పార్టీ మండ ల కార్యదర్శి సాదం రమేష్,బిజెపి గ్రామ శాఖ అధ్యక్షు డు సాదం భీములు, గ్రామస్తు లు జిల్లా కలెక్టర్ ను కోరారు. కృష్ణాజిగూడెం గ్రామంలో హేల్త్ సెంటర్ నిర్మిం చాలని కోరుతూ గ్రామ ప్రజలు సోమవారం జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కు వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009 లో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మరికుంట్ల మార్కొండయ్య దగ్గర నుండి 3ఎకరాల భూమి కొనుగోలు చేసి మాడల్ కాలనీలో ఇందిరమ్మఇండ్లకోసం100 ప్లాట్లు చేసి ఇంటి స్థలం లేని నిరుపేదలకు గ్రామంలోని అన్ని పార్టీలతో కలిసి ప్లాట్లపంపిణి చేయగా రోడ్డుకు ముందుభాగంలో గ్రామ పంచాయతీ, పశువుల హాస్పిటల్, హెల్త్ సెంటర్ కోసం, మహిళా భవన్ కోసం ప్లాట్లు తీయడం జరిగిం దని తెలిపారు. ఈ మధ్యలో గ్రామ పంచాయతీ నుండి ఎలాంటి అనుమతి లేకుండా ప్లాట్లలో ఎస్సీ కమ్యూని టీ హాల్ కట్టడం కోసం దౌర్జన్యంగా పునాది నిర్మాణం చేపట్టారని అన్నారు. ఈ మధ్య హెల్త్ సెంటర్ కోసం 20 లక్షలు మంజూరు ఐనవని అట్టి స్థలంలో హెల్త్ సెంటర్ కట్టాలని గ్రామస్థులు అందరు గ్రామపంచాయతి తీర్మానం పెట్టడం జరిగిందన్నారు. దాన్ని కొందరు రాజకీయ అండదండలతోగ్రామానికి హెల్త్ సెంటర్ రాకుండ అడ్డు కోవడం విడ్డురంగా ఉన్నదని,హెల్త్ సెంటర్ కోసం ఏఈ, వర్క్ ఇన్స్పెక్టర్ 6 సార్లు హాస్పిటల్ కోసం ముగ్గు పోయడానికి వచ్చినవారిని వెళ్ళగొట్టార ని జిల్లా కలెక్టర్ కు తెలిపారు. ప్రభుత్వ స్థలంలో కులసంఘాల కమీటి భవనాలు నిర్మాణం చేయవద్దని,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేల్త్ సెంటర్ వెంటనే నిర్మాణ ం జరిగేవిధంగా చూడాలని ఆర్డిఓకు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాదం రాజేందర్, సాదం రమేష్, సాదం, (కొత్తగోళ్ల) బీమయ్య, సాదం రవి (మాజీ ఉప సర్పంచ్), వడ్లకొండ యాదగిరి, గద్ద కుమార్, సాదం (మచ్చ) వెంకటయ్య, సాదం శ్రీనివాస్, గిరాబోయన లింగయ్య, నిరటి సురేష్, బైరగోని రాంచంద్రం, సాదం రవీందర్, గద్ద రాజు, సాదం పాల వెంకటయ్య, పాల్గొన్నారు.

# వాసుదేవరెడ్డి దానం చేసిన భూమిని కబ్జా యత్నం

- తొలగించటానికి వచ్చిన వారిపై దాడి
- ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**భీమదేవరపల్లి:ఆగష్టు 18(జనంసాక్షి):** భీమదేవరపల్లి మండలం విశ్వనాధ కాలనీలో భూమి వివాదం రచ్చకెక్కింది.గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి సారయ్య,గతంలో వాసుదేవరెడ్డి దానం చేసిన భూమిని అక్రమంగా ఆక్రమిం చేందుకు యత్నించాడని,వల్లెపు నాగరాజు ఆరోపించారు.మండలం కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాసుదేవ రెడ్డి మా గ్రామస్తులకు దానం చేసిన భూమిని బొమ్మిశెట్టి సారయ్య కబ్జా చేసి అక్కడ రేకుల షెడ్,గడ్డి కట్టలను,వేశారు.జూన్ 19 తేదీన రోజు గ్రామస్థులం అందరం వాసుదేవ రెడ్డి పర్యవేక్షణలో తొలగించారని వల్లెపు నాగరాజుఆరోపించారు. సారయ్య నిర్మిం చిన రేకుల షెడ్ స్థలంలో కనీలు ఉండగా గ్రామస్తుల సహకారంతో తొలగిం చామ ని నాగరాజు తెలిపారు.ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి కొమురయ్య, ఎల్లయ్యలతో పాటు బొమ్మిశెట్టి సారయ్య కలిసి తమపై దాడికి పాల్పడ్డారని ఆయన వాపోయారు.బతుకమ్మ బండ వద్ద పాతిన హద్దు రాళ్లను వారు వారే తొలగించారని,అడ్డు వచ్చిన వారిని బెదిరించారని నాగరాజు అన్నారు. భూమిని రక్షించేందుకు చేస్తున్న ప్రయత్నాలను తప్పుగా వర్ణించి తమను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకొని మా గ్రామస్తులకు న్యాయం చేయాలని గ్రామస్తులంతా కోరారు.ఈ విషయమై ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో గ్రామస్తులందరూ ఫిర్యాదు చేసినట్టు నాగరాజు వెల్లడించారు.

# కృత్యమేళాతో విద్యార్థులకు భోధన సులభతరం

- మండల విద్యాశాఖ అధికారిని
- బైరి సరళ, ఎంపీడీవో నల్ల శ్రీవాణి



**చెన్నారావుపేట, ఆగస్టు 18(జనంసాక్షి):** కృత్యమేళాతో విద్యార్థులకు భోధన సులభతరం అవుతుందని చెన్నారావుపేట మండల విద్యాశాఖ అధికారిని బైరి సరళ, ఎంపీడీవో నల్ల శ్రీవాణిలు అన్నారు. సోమవారం మండలంలోని జల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి అభ్యసన కృత్యమేళా కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని ఉపాధ్యాయులు ప్రదర్శించిన వివిధ రకాల ఎగ్జిబిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కృత్యమే ళా కార్యక్రమం వలన ఉపాధ్యాయులు విభిన్న రీతులలో ఎగ్జిబిట్ లు తయారు చేయడం వలన వారిలోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ కృత్యమెళా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కృత్యమెళా కార్యక్రమం వలన విద్యార్థులకు బోధనను సులభమైన పద్ధతిలో బోధించుటకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కృత్యమెళా కార్యక్రమంలో ఉపాధ్యాయులు తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులపై విభిన్న రీతులలో ఎగ్జిబిట్లను తక్కువ ఖర్చుతో తయారు చేసుకొని వచ్చి ప్రదర్శించారు. మండల స్థాయి కృత్యమెళా కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు 92 ఎగ్జిబిట్స్ ను వినూత్న రీతిలో తయారుచేసుకొని వచ్చి ప్రదర్శించినట్లు వివరించారు. మండల స్థాయి కృత్యమెళాలో విజేతలు అయిన పాఠశాల లను త్వరలో జిల్లా స్థాయిలో జరిగే కృత్యమెళా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలలో పాపయ్యపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బోయినపెల్లి ప్రభాకర్ రావు, అబ్బర్వర్లు సంతోష్, హరి, అనిత, ప్రధానోపా ధ్యాయులు అంగోతు భద్రయ్య, ఈర్య, బానోతు వెంకన్న, కట్టస్వామి, నరసింహరెడ్డి ఉపాధ్యాయులు ఉమా శంకర్, రాజు, అనిల్, అక్షయ, మాధురి, మాధవి, సునీత, ఝాన్సీరాణి, ఉమారాణి, సంధ్యారాణి, పవన కుమారి, కప్పల కొమురయ్య, రత్న సింగ్, సతీష్, శాంత మెరి, నర్సయ్య, విజేందర్ రావు, కిరణ్ కుమార్, రాజేందర్, సీఆర్పీలు శిల్ప, సంపత్, స్వామి, బాలు, ఐఈఆర్ పి రాము, పాల్గొన్నారు.

## దర్గా చెరువు తూము కట్టను సందర్శించిన అధికారులు



**పర్వతగిరి ఆగస్టు 18 (జనంసాక్షి):** పర్వతగిరి మండలం అన్నారం దర్గా చెరువు తూము,కట్ట కోతకు గురై గండ్లు పడగా సోమవారం రోజు పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి ఎంపీడీవో శంకర్ నాయ ఎక్‌లు సందర్శించి తాత్కళిక మరమ్మతు పనులు చేయించారు. ఈ కార్యక్రమంలొ ఇరిగేషన్ అధికారి బషీర్ ఆర్ బి ప్రమోద్ పంచాయితీ కార్యదర్శి మొయిన్ కారోబార్ యాకయ్య గ్రామపంచాయితీ రెవెన్యూ సిబ్బంది తూము వద్ద పాడిన గడి వద్ద ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక మరమ్మతులు చేసినారు.

# వరద నీరు నిలిచి ఉండకుండా పూడిక తొలగింపు చేపట్టాలి

- 13,22 డివిజన్‌లలో శానిటేషన్ తనిఖీలు





**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 18(జనంసాక్షి):** వరద నీరు నిలిచి ఉండకుండా ఎప్పటికపుడు పూడిక తొలగింపు చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు.సోమవారం వరంగల్ పరిధి 13,22 డివిజన్‌ల పరిధి లోని ఏకశిలా నగర్ దేశాయిపేట రోడ్డు చిన్న వడ్డేపల్లి చెరువు కట్ట ప్రాంతాలతో పాటు 22వ డివిజన్ పరిధిలోని కొత్తవాడ బ్యాంక్ కాలనీ మర్రి వెంకటయ్య కాలనీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి శానిటేషన్ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూవరద ముంపు నివారణ కోసం తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఇందుకోసం వరద నీరు వడ్డేపల్లి చెరువులో కలువ నున్న క్రమంలో కమిషనర్ ఆ ప్రాంతాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను అధికారులను కార్పొరేటర్ లను అడిగి తెలుసు కున్నారు .అనంతరం పారిశుద్ధ్య సిబ్బంది హాజరు ను తనిఖీ చేసిన కమిషనర్ ఫీల్డ్ లో పనిచేస్తున్నారో లేదా జవాన్లను అడిగి తెలుసుకున్నారు, ఇద్దరు రెగ్యులర్ జవాన్లు దీర్ఘ కాలికంగా గైర్హాజరు నేపథ్యంలో వారికి వేతనం వస్తుందా తెలుసుకోవడానికి ఆన్ లైన్‌లో ఎంక్వైరీ చేశారు, జవాన్ లకు సూచనలు చేస్తూ ప్లాస్టిక్ ను విక్రయిస్తున్న వారికి పెనాల్టీ లు విధించాలని, ప్రతి గృహం నుండి 100% చెత్త సేకరణ జరగాలని, వర్షాకాలం నేపథ్యంలో వరద నీరు నిలువ ఉండకుండా ఉండడానికి ఎప్పటికప్పుడు డ్రైన్‌లలో పూడిక ను తొలగించాలని కమిషనర్ అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సురేష్ జోషి, బసవరాజు కుమారస్వామి, సిఎంహెచ్ ఓ డా.రాజారెడ్డి, ఏంహెచ్ ఓడా.రాజేష్, డిఈ సతీష్, సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, శానిటరీ ఇన్స్పెక్టర్ భీమయ్య, హెల్త్ ఇన్స్పెక్టర్ మధుకర్ పాల్గొన్నారు.

# వేగవంతంగా ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం

- ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- బల్దియా ప్రధాన కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమం
- వివిధ భాగాలకు సంబంధించి 81 దరఖాస్తుల స్వీకరణ





**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 18(జనంసాక్షి):** వేగవంతంగా ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం చూపాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని సందర్భాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రదాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తు లను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా..ఇంజనీరి ంగ్15, .హెల్త్ సానిటేషన్8,ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)13,టౌన్ ప్లానింగ్41, హార్టికల్చర్2,నీటి సరఫరా2 మొత్తంగా 81 వినతులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సి ఎంహెచ్ ఓ డా.రాజారెడ్డి , ఇన్చార్జి ఎస్ ఈ, సిటీ ప్లానర్ లు మహీందర్, రవీందర్ రాడేకర్, వెటర్నరీ వైద్యులు డా. గోపాల్ రావు, హెచ్‌ఓ లు రమేష్, లక్ష్మారెడ్డి డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలి

- తాటికొండలో ఘనంగా పాపన్న జయంతి వేడుకలు



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 18 (జనంసాక్షి) :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ప్రతి ఒక్క రు కొనసాగించాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి ఐలోని సుధాకర్ గౌడ్, తాటికొండ గౌడ సంఘం అధ్యక్షుడు బొంగోని యాదగిరి గౌడ్ అన్నారు. మండలంలోని తాటికొండ గ్రామపంచాయతీ ఆవరణ లో బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న 375 వ జయంతి ఉత్సవాలు సోమవారం రోజున ఘనంగా నిర్వహించారు. శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి ఉత్సవాల సందర్భంగా గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి ఐలోని సుధాకర్ గౌడ్, ప్రత్యేక అతిథులుగా గౌడసంఘఅధ్యక్షుడు బొంగోని యాదగిరి గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎదునూరి సత్య నారాయణ,మాజీ గ్రామపంచాయతీ కార్యదర్శి ఐలోని మల్లేశం, గ్రామ పెద్దలు పాల్గొని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదనిఅన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజల కోసం పోరాడిన నేతగా పేరు గాంచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు ఈనాటిసమాజానికి మార్గదర్శకాలు కావాలని,ఆయన చూపిన ధైర్యం, తెగువ, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం అందరికీ ఆదర్శమని,వారి ఆశయాల ను కొనసాగించాలని పేర్కొన్నారు. మన పూర్వీకుల జీవన పద్ధతుల్ని, కృషిని ప్రతిబింబించే ఈ వృత్తులను మరువకుండా, తదుపరి తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎదునూరి సత్యనారాయణ, కారోబార్ ఎండి సలీం, మాజీ గ్రామ పంచాయతీ కార్య దర్శి ఐలోని మల్లేశం గౌడ్, మాజీ వార్డ్ మెంబర్ ఉమ్మ గొని రాజు గౌడ్, ఐలోని రవి గౌడ్, ఐలోని రాజు గౌడ్, నూనె ముంతల నరసయ్య గౌడ్, బూరుగు మల్లయ్య గౌడ్, పొన్నం రఘుగౌడ్, పులిగిళ్ళ రాజు, అక్కెనపల్లి వెంకటయ్య, నీల రాజు, మారపాక మధు, ఎడమ శంకర్, పోకల నరేష్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## సిసి రోడ్లు మంజూరు చేయాలని మంత్రికి వినతి

- నిత్యం ప్రజా క్షేత్రంలో మాజీ సర్పంచ్




**కాటారం ఆగస్టు 18 (జనం సాక్షి):** కాటారం మండలం లోని రేగులగూడెం గ్రామంలో సీసీ రోడ్లు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను రేగులగూడెం మాజీ సర్పంచ్ అయినినేని నవీన్ రావు కోరారు. సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసి మేజర్ గ్రామపం చాయతీ అయిన రేగుల గూడెం పరిధిలో దేవరాంపల్లి, గోపాలపురం, గంగారం ఎక్స్ రోడ్, బూడిది పల్లె గ్రామాల్లో సిసి రోడ్లు లేని వాడలు ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు సీసీ రోడ్లు మంజూరి చేయిస్తానని హామీ ఇచ్చినట్లు మాజీ సర్పంచ్ నవీన్ రావు పేర్కొన్నారు. తమ విన్నపాన్ని మన్నించి సీసీ రోడ్లు మంజూరు హామీ ఇచ్చిన శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రేగుల గూడెం మాజీ సర్పంచ్ ఐలినేని నవీన్ రావు తోపాటు, గంధం బాలరాజు, గంధం భీమయ్య పాగే సురేష్ పాగే సమ్మయ్య కుమ్మ రి నగేష్ జిముడ పెద్దరాజయ్య , జనగాం నారాయణ మారపాక లింగయ్య సోదరి రాజమల్లు, సోదరి మల్లయ్య పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



**మహబూబాబాద్ బ్యూరో, ఆగస్టు 18(జనంసాక్షి):**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, 375వ జయంతి వేడుకలు అధికారికంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో , అదనపు కలెక్టర్ రెవెన్యు కె.అనిల్ కుమార్ తో హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిం చారు.గౌడ కులస్తులు వృత్తిని ప్రేమిస్తూ పిల్లలను బాగా చదివించు కోవాలని, మీరు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సమాజంలో అన్ని వర్గాల ప్రజలు బాగుపడితేనే రాష్ట్రం దేశం బాగుపడుతుందని గౌడలకు అభినందనలు! శుభాకాంక్షలు తెలియజే శారు.ఈ కార్యక్రమంలో బి.సి.సంక్షేమ అధికారి నరసింహా స్వామి, స్థానిక ప్రజాప్రతి నిధులు గౌడ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో కోతులు,కుక్కల బెడద





**కాళేశ్వరం ఆగస్టు 19(జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం గ్రామంలో కోతులు, కుక్కలు ఎక్కువగా ఉండటంతో గ్రామస్తులు, స్థానికులు, ఆలయా నికి వచ్చే భక్తులు భయాందో ళనలకు గురి అవుతున్నా రు. గత వారంలో మసీదు పల్లి వాడలో ఐదుగురి వ్యక్తులపై కుక్కలు దాడి చేయగా వారికి ప్రాణాపాయం తప్పి హాస్పటల్లో చికిత్స పొందుతున్నారు. ఇది జరిగిన రెండు రోజులకే కోతులు కాళేశ్వరం దేవస్థానం సిబ్బంది ఒకరిపై దాడి చేసాయి. అంతే కాకుండా ఇటీవల కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి వచ్చిన భక్తులపై కూడా దాడి చేయగా వారు గాయాల పాలు అయ్యారు. కోతులు కుక్కలు స్థానిక ప్రజలు, భక్తులపై దాడి చేస్తున్న సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. కోతుల బెడద నుంచి కాపాడుకోవడానికి గ్రామస్తులు తమ ఇండ్ల చుట్టూ లక్షలు ఖర్చుపెట్టి ఇనుప జాలీలు పెట్టించుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కోతులను తెచ్చి అడవిలో వదిలి వేస్తుండగా అవి కాళేశ్వరం గ్రామంలో తిష్ట వేసి ప్రజలను ఇబ్బందు లకు గురి చేస్తు న్నాయి. ఇకనైనా కోతులు, కుక్కల బెడద తగ్గించాలని ప్రజలు అధికారు లను కోరుతు న్నారు.

## భారీ వర్షాలు రైతులు ఆగమాగం

- నీటమునిగిన పంట పొలాలు



**మల్హర్, ఆగష్టు 18(జనంసాక్షి):** భారీ వర్షాలతో పొలాలు నీటమునిగి, పత్తి చేనులలో నీరు నిలిచి రైతన్నలు ఆగమాగం అవుచున్నారు.భూపాలపల్లి జిల్లా మాలహర్ రావు మండలంలో గత నాలుగు రోజులుగా కూరుస్తున్న వర్షాలతో చెరువులు మత్తటి దునుకూచున్నాయి.వాగులు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి. మానేరు సైతం ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. మోరెంచ వాగు ప్రవాహం మానేరులో కలవటం తో మానేరు కు వరద ప్రవాహం ఎక్కువైనది.మానేరు ఒడ్డు పొంటీ ఉన్నా రైతుల కరెంటు మోటార్లు నీటమునిగాయి.చెరువుల కింద ఉన్నా పంట పొలాలు నీట మునిగిపోతున్నాయి. వరి నాటువేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి నారుపోసిన రైతులు దిక్కు తోచని పరిస్థితి. వర్షాలు లేకపోయినా రైతుకే వర్షాలు బాగా పడినా రైతుకే నష్టం జరుగుతుంది అని రైతులు వాపోవుచున్నారు. భారీ వర్షాలు రైతంగానికి తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. ఇంకా కౌలు రైతుల పరిస్థితి మరి దారుణంగా తయారైంది. వరి, పత్తి,మిర్చి, కూరగాయల పంటలు అన్ని నీట మునిగాయి.ప్రభుత్వం రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి అని రైతులు కోరుకుంటున్నారు.

## బహుజన సర్దార్ ఆశయాలను కొనసాగిస్తాం



**పరకాల, ఆగష్టు 18 (జనంసాక్షి):** బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి ఉత్సవాలు పరకాల మండలం కామారెడ్డిపల్లి గ్రామంలో కలుగీతా కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిర్ర హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఉమ్మడి వరంగల్ జిల్లా గౌడ సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ ఆముదాలపెల్లి మల్లేశం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని పాపన్న విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశం గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న రాజ్యాధికారం కోసం చేసిన పోరాటాలు ఆయన రచించిన పన్నాగాలు ధైర్య సాహసాలు మనందరిలో ఉండాలని, అయన ఆశయాలను కొనసాగిస్తూ ఐక్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. బహుజన వర్గాలను ముందుకు తీసుకెళ్లడమే పాపన్న కిచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, గౌడ సంఘ నాయకులు బుర్ర రాజమౌళి, చిర్ర సతీష్, రామ్మూర్తి, చిర్ర సాంబయ్య గౌడ్, సంఘం అధ్యక్షుడు తడక రాజయ్య గౌడ్, గౌడ సంఘం ఉపాధ్యక్షుడు చిర్ర భద్రయ్య గౌడ్, మాజీ సర్పంచ్ చిర్ర రాజయ్య గౌడ్, మాజీ గౌడ సంఘం అధ్యక్షుడుదొమ్మటి రమేష్ గౌడ్, గౌడ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## జోహార్ హైస్కూల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**ములుగు/వెంకటాపూర్,ఆగస్ట్18(జనంసాక్షి)::** వెంకటాపూర్ గ్రామ శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో జోహార్ హై స్కూల్ చిన్నారులచే శ్రీ కృష్ణ గోపిక వేషధారణలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా బాలకృష్ణులచే ఆలయంలో పురోహితులు మరియు వర్తక సంఘం ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. జోహార్ స్కూల్ కరస్పాండెంట్ అబ్దుల్ జహీద్ దేవాలయ పురోహితులు మరియు వర్ధక సంఘం అధ్యక్షులకు దివ్య పవిత్ర గ్రంథం అయినటువంటి భగవద్గీతను బహుకరించడమైనది.

# కుండపోత వర్షం....గ్రామాలన్నీ అతలాకుతలం...!

- 163 జాతీయ రహదారిపై భారీగా చేరిన వరద నీరు నిలిచిన రాకపోకలు
- వాగులు, వంకలు, వొర్రెలు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- భయంగుపెట్లో బిక్కుబిక్కుమంటున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు



**మంగపేట ఆగస్ట్ 18(జనంసాక్షి):** మండల వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షానికి మంగపేట మండలం అంత అతలాకుతలం అయింది. సోమవారం తెల్లవారుజాము నుండి ఎడతెరపి లేకుండా వాన కురవడంతో గ్రామాల్లోని కాలనీలు వరద ముంచెత్తింది. పలు కాలనీల్లో ప్రజలు బయటికిరాలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని కమలాపురం గ్రామంలో ఎర్రవాగు ఉధృతంగా ప్రవహించి ఇందిరా కాలనీ ఇండ్లలోకి మీరు రావడంతో ఇంట్లోని వస్తువులన్నీ కొట్టుకపోయి తీవ్ర ఆస్తి నష్టం వాటిలిందని వారు వాపోయారు. వరద ఉధృతి వలన ప్రాణాంతకమైన కీటకాలు, విషసర్పాలు ఇంట్లోకి రావడంతో వారందరూ బయటకి పరుగులు తీశారు. అలాగే ఏటూరునాగారం బూర్గంపాడు జాతీయ రహదారిలో గల జీడివాగు , కమలాపు రం బిల్ట్ కర్మాగారం ప్రధాన గేట్ వద్ద గల ఎర్రవాగు, మంగపేట మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద జాతీయ రహదారిపై భారీగా వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో కొన్ని గంటలపాటు వాహనాల రాకపోకలలు పూర్తిగా అధికారులు నిలుపుదల చేశారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలలో పూర్తిగా వరద నీరు చేసి చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షానికి సైతం పలు గ్రామాలకు వెళ్లే మార్గాల్లో చెరువులు, వాగులు ఉప్పొంగి రాకపోకలు స్తంభించాయి. మండలంలోని శనిగకుంట, బొంబాయిగూడెం గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి.



వివిధ గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో వేసిన వరి నాట్లు వరద ప్రవాహంతో కొట్టుకపోతుంటే రైతన్నలు చేసేది ఏమీ లేక కన్నీరు మున్నీరవుతున్నారు. లక్షల్లో పెట్టుబడి పెట్టి వరి నాట్లు వేయడం జరిగిందని ఈ అపార నష్టాన్నీ ప్రభుత్వమే భరించి మమ్మల్ని ఆదుకోవాలని రైతన్న లు వేడుకుంటున్నారు. గత మూడు రోజుల క్రితమే కురిసిన భారీ వర్షాలకు సైతం వ్యవసాయ పొలాల్లోని వరి నాట్లు పూర్తిగా కొట్టకపోయి ఇసుక మేటలు వేయడం జరిగిందని మళ్లీ ఇలా ఎడతెరపలేని కుండపోత వర్షం వలన పూర్తిగా నష్టపో యామని వారు వాపోయారు. అలాగే తిమ్మంపేట గ్రామపంచాయతీ పరిధిలోగల అబ్బాయిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గం వరద నీటి ప్రవాహంతో కోట్టుకపోవడం వలన గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. ఎడతెరిపలేని కురిసిన భారీ వర్షానికి మండల వ్యాప్తంగా ప్రజలందరూ అతలాకుతలమయ్యారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు. అధికారులందరం అప్రమత్తంగా ఉన్నాం : తహసిల్దార్ తోట రవీందర్ మండలంలోని లోతట్టు ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రిహాబిలిటేషన్ సెంటర్లను సిద్ధం చేసి పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. గోదావరి, గౌరారం వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ముంపు ప్రాంతాలైన మంగపేట, చుంచుపల్లి, రమణక్కపేట, రాజుపేట, వాడగూడెం, అకినేపల్లి మల్లారంలోని ప్రజలను అప్రమ త్తం చేసినట్లు తెలిపారు. అవసరమైతే ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సైతం రంగంలోకి దింపేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రజలు అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని తహశీల్దార్ తోట రవీందర్, ఎస్సై టివిఆర్ సూరి, హెచ్చరించారు.

## పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలి



**పెద్దవంగర ఆగష్టు 18(జనంసాక్షి):** పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎంఈఓ బుధారపు శ్రీనివాస్, పిఆర్ టీ యూ మండల శాఖ అధ్యక్షుడు గంగిశెట్టి రమేష్ కుమార్ అన్నారు. సోమవారం భోజన విరామ సమయంలో మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద పిఆర్టియు ధర్నాకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని పిఆర్టియు రాష్ట్ర శాఖ సెప్టెంబర్ ఒకటవ తారీఖున హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పిఆర్టియు నిరంతరం పోరాడుతుం దని, సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు. మండలం నుంచి ఉపాధ్యాయులు భారీగా తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు మండల ప్రధాన కార్య దర్శి సురేష్ కుమార్, నేతలు బాలరాజు, విద్యాసాగర్, నరసింహారావు హైమ,పాల్గొన్నారు.

## ఘనంగా ఝాన్సీ రెడ్డి జన్మదిన వేడుకలు



**పాలకుర్తి, ఆగష్టు 18 (జనంసాక్షి):** టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఝాన్సీ రెడ్డి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో కలిసి కార్యకర్తలు, ఝాన్సీ రెడ్డి అభిమానులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గల రాజీవ్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఝాన్సీ రెడ్డికి గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యశస్విని రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో ఝాన్సీ రెడ్డి ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలమ్మ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లావుడియా మంజుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్, ఎర్రబెల్లి రాఘవరావు, బండిపెల్లి మనెమ్మ, పాలకుర్తి పట్టణ కమిటీ నాయకులు కమ్మగాని నాగన్న, వీరమనేని యాకాంత రావు, మారం శ్రీనివాస్, పెనుగొండ రమేష్, సలేంద్ర శ్రీనివాస్, కత్తుల బిక్షపతి, ఎడవల్లి సోమల్లయ్య, ఎండి మదర్, ఎండి నజీర్, ఎండి సలీం, పన్నీరు వెంకన్న, ఆకుల నాగరాజు, కమ్మగాని మహేందర్, గద్దల యాక సోమయ్య, పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**టేకుమట్ల ఆగష్టు 17 (జనంసాక్షి):** టేకుమట్ల మండల కేంద్రంతో పాటు మండలంలోని పంగిడిపల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద జయంతి వేడుకలను గౌడ సంఘం నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న రాజ్యం ఏర్పాటు చేసి పరిపాలించిన విధానాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు నేరెళ్ల.రామకృష్ణ గౌడ్,బొల్లి కొండ రాజయ్య, బొంగోని సురేష్, తిరుపతి. కొయ్యల చిరంజీవి, శివ, పల్లేర్ల తిరుపతి, గుర్రపు నాగరాజ్, మాదారం మల్లికార్జున్, అభినయ్, మాదారపు కుమారస్వామి, విజయ్ శివ ఇంద్రసేనా గౌడ్ బండి శీను రామకృష్ణ ప్రభాకర్ తిరుపతి పాల్గొన్నారు.

## ఘనంగా యాదవ సంఘం మండల అధ్యక్షులు జన్మదిన వేడుకలు

**టేకుమట్ల ఆగష్టు 18 (జనంసాక్షి):** టేకుమట్ల యాదవ సంఘం మండల అధ్యక్షుడు మాదం కొమురయ్య జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో యాదవ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం మండల నాయకులు గిరవెన భాస్కర్, గిరవేన కిరణ్, నూనేటి రమేష్, గొర్రె మేకల వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం ఓదేలు యాదవ్, గిరవేణి తిరుపతి యాదవ్, పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి



**ఖానాపురం, ఆగస్టు 18(జనంసాక్షి):** ఈ వర్షాకాలం సీజన్లో సంక్రమించి వ్యాధుల పట్ల జాగ్రత్తలు చేపట్టాలని వరంగల్ జిల్లా డిప్యూటీ డి ఎం హెచ్ ఓ ప్రకాష్ అన్నారు.సోమవారం కనాపురం మండలం కేంద్రంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలించి పలు సూచనలు చేశారు.జాతియ ఆరోగ్య కార్యక్రమాలు వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణీ స్త్రీల నమోదు ,ప్రభుత్వాసుపత్రిలో డెలివరీసు కంపల్సరిగా అయ్యేటట్లు చూడాలని కోరారు.వజీ నేపల్లిలోని మహాత్మ జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ స్కూల్లో జాతీయ నులి పురుగుల దినోత్సవం రోజు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోనీ పిల్లలకు ఈరోజు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ డిప్యూటీ డిఎం హెచ్ ఓ ప్రకాష్ మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల పిల్లలు తప్పనిసరిగా సంవత్సరానికి రెండు సార్లు తీసుకోవాలని తీసుకొనట్లయితే విద్యార్థులలో కడుపునొప్పి, వికారం, వాంతులు ,అలర్జీ రక్తహీనత ,ఆకలి లేకపోవడం, బలహీనత, బరువు తగ్గడం లాంటి సమస్యలు వస్తాయని ఈ సమస్యల వల్ల విద్యార్థులు సరిగా చదువుకోలేరని అందుకోసమే తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు మింగాలని చెప్పారు. గోళ్లుశుభ్రంగా ఎల్లప్పుడూ పరిశుభ్రమైన నీటిని త్రాగాలని, తినేముందు,బాత్రూం పోయి వచ్చిన ప్రతిసారి తప్పనిసరిగా చేతులను సబ్బుతో కడుకోవాలని కోరారుగత నాలుగు రోజులుగా స్కూల్లో కిషోర రక్ష ప్రోగ్రాం జరుగుతున్న విధానాన్ని సమీక్షించారు. కిషోర్ రక్ష ప్రోగ్రాం విద్యార్థుల కోసం జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమం విద్యార్థులకు అన్ని రకాల వైద్య సేవలు వైద్య పరీక్షలు అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడటం ముఖ్యంగా రక్తహీనత లేకుండా చేయడం మంచి ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఈ ప్రోగ్రామ్మూ రూపొందించారని తెలిపారు.అందరూ తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని మళ్లీ మూడు నెలల తర్వాత మళ్లీ పరీక్షలు చేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పల్లె డాక్టర్లు డాక్టర్ కల్పన డాక్టర్ సునీత కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజయ్య, ఫార్మసీ ఆఫీసర్ అన్నపూర్ణ దివ్య,ల్యాబ్ టెక్నీషియన్ సతీష్ హెల్త్ అసిస్టెంట్ లు గొడిశాల భాస్కర్ , జ్యోతి ఆశా జ్యోతి, స్కూల్ ప్రిన్సిపల్ జయశ్రీ స్కూల్ ఫార్మసీ ఆఫీసర్ శిరీష పాల్గొన్నారు

# ఆపరేషన్ కగారును నిలిపివేయాలి

• **వరంగల్ బహిరంగ సభ కరపత్రం,పోస్టర్ ఆవిష్కరణ**



**భీమదేవరపల్లి:ఆగస్టు18(జనంసాక్షి):** ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 24 ఆగస్టున అంబేద్కర్ భవన్ వరంగల్లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ... ఉమ్మడి హనుమకొండ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ విగ్రహం కూడాలి వద్ద సోమవారం వేదిక జిల్లా కో కన్వీనర్ కొత్తూరు ఇంద్రసేన ఆధ్వర్యంలో కరపత్రం పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగాఇంద్రసేన మాట్లాడుతూ మధ్య భారత దేశంలో ఆదివాసీల యొక్క హత్యాకాండను నిర సిస్తూ ఆపరేషన్ కగారును నిలిపివేసి పోలీస్ క్యాంపులు ఎత్తివేయాలని, తక్షణమే కాలుపుల విరమణ ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న భారత రాష్ట్ర సమితి గ్రామ అధ్యక్షులు కోన భరత్ మాట్లాడుతూ 1/70 యాక్ట్ అమలు చేయాలన్నారు. మండల జేఏసీ నాయకులు ద్యగల సారయ్య మాట్లాడుతూ అటవీ హక్కుల పరిరక్షణ చట్టం పెస చట్టం గ్రామసభ తీర్మానాలు అమరుచాలని ఆదివాసులను చంపే హక్కు ఎవరికీ లేదని రాజ్యాంగంలో ఆర్టికల్ 21 జీవించే హక్కును కాలరాయొద్దని అన్నారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గొల్లూర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈ దేశ సంపదపై హక్కు కొంతమంది కార్పొరేట్లకు మాత్రమే లేదని ఈ దేశ సంపద దేశ ప్రజలందరిదని అన్నారు.ఆగస్టు 24వ తేదీన అంబేద్కర్ భవన్ హనుమకొండలో వరంగల్ ఆదివాసి హక్కుల సంఘీభావ పోరాట వేదిక నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని,ఈ కార్యక్రమాన్ని ప్రజలు ప్రజాస్వామిక వాదులు విద్యార్థులు మేధావులు కార్మికులు కర్షకులు మహిళా దళిత సంఘాలు అందరు కూడా పాల్గొని సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి జేఏసీ నాయకులు ద్యగల సారయ్య, భారత రాష్ట్ర సమితి మాణిక్యపుర్ గ్రామ అధ్యక్షులు కోన భరత్, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం బొల్లంపల్లి రాజు, సిపిఐ మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్, తెలంగాణ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపల్లి జగన్, తెలంగాణ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తాళ్లపల్లి ప్రభాకర్, తెలంగాణ రైతాంగ సమితి డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్, తెలంగాణ రైతాంగ సమితి మండల కన్వీనర్ గజ్జి శ్రీనివాస్, బంధుమిత్రుల సంఘం నాయకులు గజవెల్లి మురళి,తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గడిపే బిక్షపతి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిందాల అంజి,తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా ఉపాధ్యక్షులు కోడికూటి చేరాలు,పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు..



**పెద్దవంగర ఆగష్టు 18(జనంసాక్షి):** సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగించాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముద్దసాని సురేష్ మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికారం కోసం నిరంతరం పోరాటం చేసిన మహనీయుడు అని కొనియాడారు. నిరుపేదలలో చైతన్యం తేవడానికి అనేక పోరాటాలు చేసిన మహావీరుడు అన్నారు. అనంతరం స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రంగు మురళి, బీస్ హరికృష్ణ, అనపురం శ్రీనివాస్, అనపురం రాజు, అనపుర వినోద్, వంశీ, శ్రీను, దేవేంద్ర, మంజుల పాల్గొన్నారు.

# గోదావరి పరివాహక ప్రాంతాలలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

• **ములుగు జిల్లా ఎస్పీ శబరిష్ పిఐపిఎస్**



**నూగూర్ వెంకటాపురం ఆగస్టు 18(జనంసాక్షి):** ములుగు జిల్లా లో కురుస్తున్న వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాలు, గోదావరి పరివాహక గ్రామాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శబరిష్ పి తెలిపారు. వరద ప్రవాహం ఉన్న వంతెనలు, కలవర్టులు, రహదారులపై దాటరాదని అన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావాలని ఆయన హెచ్చరించారు. వరద ప్రాంతాల్లో విధుల్లో ఉన్న పోలీసులు సూచనలు పాటించి వారికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో వాగులు, చెరువులు, కుంటల పరిస్థితిని సమీక్షిస్తూ ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో వాతావరణ శాఖ భారీ వర్ష సూచన జారీ చేసిన నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ముంపు ప్రాంత ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్ డి ఆర్ ఎఫ్ ), జిల్లా విపత్తు ప్రతిస్పందన దళం (డిడిఆర్ఎఫ్), బృందాలను సిద్ధం చేశామని అన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితి ఎదురైనా జిల్లా పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. అత్యవసర పరిస్థితులలో ప్రజలు డయల్100 ద్వారా పోలీస్ సహాయం పొందవచ్చని జిల్లా ఎస్పీ శబరిష్ తెలియజేశారు.

# లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

• **11 మందికి గాయాలు**




**శాయంపేట, ఆగస్టు 18 (జనంసాక్షి):** శాయంపేట మండలంలోని సింగారం గ్రామం స్టేజివద్ద జాతీయ రహదారి పైన లారీని వెనుక నుండి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో 11 మందికి గాయాలయ్యాయి, వారిని ఎంజిఎం హాస్పిటల్ కు పంపించామనిఎస్సై పరమేశ్వర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే హనుమకొండ నుండి కాళేశ్వరం వెళుతున్న ఆర్టీసీ బస్సు 0045 సింగారం స్టేజ్ దాటిన తర్వాత ,రోడ్డుపై ఎలాంటి పార్కింగ్ లైట్స్ లేకుండా%ూౄ 24శ% 3939లారీని నిలిపి ఉంచడం వలన, మరొక లారీపంచరై ఆ రోడ్డుపైన ఉండటం వలన లారీని తప్పించబోయి బ్రేక్ వేయడం వలన తన ముందున్న లారీని ఢీకొట్టడం జరిగిందని , ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎండి గౌసోదిన్ దరఖాస్తు ఇవ్వడం జరిగిందని , పార్కింగ్ లైట్స్ లేకుండా రోడ్డుపై లారీని నిలిపిన లారీ డ్రైవర్ పై కేసునమోదు చేసి విచారణ చేపట్టామని శాయంపేట ఎస్సై పరమేశ్వర్ తెలిపారు.

# రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

**మహబూబాబాద్ బ్యూరో, ఆగస్టు 18(జనంసాక్షి):** రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి స్థానిక ఎన్టిఆర్ స్టేడియం మహబూబాబాద్లో జరిగిన ఇంటర్నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ అండర్ 15 ఇయర్స్ కేటగిరీ లో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ స్టూడెంట్ జిల్లా స్థాయి పోటీల్లో హరీష్ అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి కి ఎంపికయ్యాడని అలాగే ఈ నెల 19న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నంలో జరిగే రాష్ట స్థాయి పోటీల్లో పాల్గొనబో తున్నాడని స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు, హరీష్ ఎంపిక కోసం కృషి చేసిన పి ఇ టి.నసీరుద్దీన్కు స్కూల్ ప్రిన్సిపల్ స్టాఫ్ అభినందనలు తెలియచేశారు.

# నానో యూరియా, నానో డీఏపీని రైతులు వినియోగించాలి

• **ఏవో బన్నరజిత**



**నల్లబెల్లి, ఆగస్టు 18 (జనంసాక్షి):** నానో యూరియా, నానో డీఏపిని రైతులు వినియోగించాలని ఏవో బన్న రజిత రైతులకు సూచించారు. ఏరువాక సాగుపడి, రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని ముచింపుల తండా గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ రైతులు అధిక యూరియా వాడకాన్ని తగ్గించాలని చెప్పారు. నానో యూరియా, నానో డిఏపీ వాడకాన్ని అందరూ అలవాటు చేసుకోవాలన్నారు. వ్యవసాయ ఇన్పుట్ బిల్లులను జాగ్రత్త పరుచుకోవాలని తెలిపారు. పురుగుల మందుల అధిక వాడకం నివారణ, భూసార పరీక్షల ప్రాముఖ్యత, సేంద్రియ ఎరువుల వాడకం, నేల సారాన్ని మెరుగు పరచడానికి పచ్చి ఎరువుల పంటను పెంచడం, పంట మార్పిడి విధానం వంటి అంశములపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు రిజిస్ట్రేషన్ లో రైతులందరూ రైతు వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

# అనవసర టెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దు

• **జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాలరావు**



**ములుగు ప్రతినిధి,ఆగష్టు 18(జనంసాక్షి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మరియు జిల్లా కీటక జనిత నియంత్రణ ప్రోగ్రాం ఆఫీసర్ తో, ములుగు పట్టణంలోని జనని ప్రైవేట్ హాస్పిటల్లో సందర్శించి డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ, రోగులకు అధిక మోతాదు యాంటీ బయటిక్స్, స్తిరాయిడ్స్ వాడకూడదని, రక్త పరీక్షలలో అనవసర టెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని యజమాన్యానికి తెలిపారు. జనని హాస్పిటల్లో పనిచేస్తున్న డాక్టర్ల మరియు ల్యాబ్ టెక్నీషియన్ సర్టిఫికెట్లను, హాస్పటల్ యందు వార్డులలో చికిత్స పొందుతున్న రోగుల కేజ్- షీట్స్, చికిత్స తీరును పరిశీలించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కీటక జనిత నియంత్రణాధికారి డాక్టర్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

## సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి

• ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు



**పరకాల, ఆగస్టు 18 (జనంసాక్షి):** పరకాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం రోజున మండల విద్యాశాఖ అధికారి యస్ రమాదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల స్థాయి ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిది గా యంపీడీఓ పెద్ది ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మనదేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు అక్షరాస్యత 18 శాతం ఉండగా ప్రస్తుతం 76 శాతానికి చేరుకున్నామని, తెలంగాణ రాష్ట్రంలో 66% అక్షరాస్యత ఉందని ఇంకా 34 శాతం నిరక్షరాస్యులు లు మిగిలిపోయారని ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వంద శాతం అక్షరాస్యతకు చేరుకో వాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. శిక్షణ పొందిన విఓఏలు, ఆర్పీలు ప్రణాళిక సిద్ధం చేసుకుని గ్రామంలో వంద శాతం అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలని సూచించారు. ఈ శిక్షణకు రిసోర్స్ పర్సన్‌గా బిక్షపతి, బాబు వ్యవహరించారు. వివిధ గ్రామాల నుంచి ఉపాధ్యాయులు, సీఆర్పీలు రమేష్, శ్రీలత, రఘుబాబు, మహేందర్, మెప్మా ఆర్పీలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు మహ్మద్ గౌస్, ఏపీయం మహేందర్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

• ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**పరకాల, ఆగస్టు 18 (జనంసాక్షి):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని పరకాల శాసనసభ్యులు ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పరకాల పట్టణ కేంద్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పరకాల పట్టణ, మండల,నడికూడ, దామెర, ఆత్మకూరు మండల సమన్వయ కమిటీ సభ్యుల సమావేశాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వారం గ్రామాలలో సమావేశాలు నిర్వహించాలని, గ్రామం లో ఉన్న రాజకీయ పరిస్థితులపై సమీక్షించారు. సమావేశంలో గత ప్రభుత్వ వైఫల్యాలు,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తు న్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించాలన్నారు. గత ప్రభు త్వం అభివృద్ధి ముసుగులో దోచుకుతున్నారని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుంద న్నారు. పాత, కొత్త లేకుండా అందరూ కలిసి కట్టుగా సమన్వయ ంతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, త్వరలోనే పార్టీలో చేరికలు ఉంటాయని అన్నారు.

## ఉత్తమ డీలర్‌కు ఘన సత్కారం



**ఖానాపూర్ ఆగస్టు 18 (జనంసాక్షి):** దశాబ్దాల కాలంగా పౌర సరఫరాల శాఖలో చౌక ధరల దుకాణం నిర్వహిస్తున్న పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన అల్లాడి వెంకటేశ్వర్లుకు ఉత్తమ డీలర్ అవార్డు దక్కింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు పొందిన సంద ర్భంగా సోమవారం పట్టణవాసులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు సురేష్, శ్యామ్ మోహన్ రావు, నాయకులు లక్ష్మణ్, రమేష్, కృష్ణస్వామిలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు ముగ్గు పోసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**పర్వతగిరి ఆగస్టు 18: (జనంసాక్షి):** పర్వతీగిరి మండలం తురకల సోమవారం గ్రామంలో లబ్ధిదారుల ఆహ్వానం మేరకు విచ్చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు లు జాటోత్ శ్రీనివాస్ నాయక్. గ్రామ కార్యదర్శి మరియు గృహనిర్మాణ శాఖ అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోసి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపినారు. లబ్ధిదారులు అధికారులు నిర్ణయించిన కొలతల ప్రకారం గా ఇంటి నిర్మాణం చేపట్టాలని, నిర్ణయిత సమయంలో ఇంటి నిర్మాణం పూర్తి చేసి గృహప్ర వేశం చేయాలని లబ్ధిదారులను కోరినారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ప్రతి అర్హునికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. మా శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు ప్రభుత్వం నుండి ఎలాంటి అభివృద్ధి పథకం వచ్చినా దళితులకు, గిరిజనులకు వెనుకబడిన తరగతుల వర్గాలకే మొదటి ప్రాధాన్య త ఇస్తున్నారు. గత పది సంవత్సరాల క్రితం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇల్లు వచ్చాయని మళ్లీ ఇప్పుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఇస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు పేదల సంక్షేమం గురించే ఆలోచన చేసి ఆచరిస్తుందని తెలిపారు. బీసీ ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అత్యున్నత స్థానం కల్పించడం కాంగ్రెస్ పార్టీ ధ్యేయం



రాహుల్ గాంధీ లక్ష్యం అని తెలిపారు ఈ సందర్భంగ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్లు వంగాల రవీంద్రర్, రేణుక నాగయ్య, ఎస్టీ సెల్ మండ ల అధ్యక్షుడు భాస్కర్ నాయక్, లచ్చు నాయక్, మాజీ ఎంపిటిసి మొహమ్మద్ అలీ, ఎస్.కె అక్బర్ పాషా, జమాల్పురం గ్రామ అధ్యక్షులు జున్న కనకయ్య యాదవ్, చల్ల వెంకన్న ఎండి షెఫిక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ముగిసిన కృత్యమేళా ప్రదర్శన

**పర్వతగిరి ఆగస్టు 18(జనంసాక్షి):** పర్వతగిరి మండలంలో ప్రాథమిక ప్రాథమికోన్నత స్థాయి పాఠశాలలకు నిర్వహించబడిన ప్రాథమిక స్థాయి కృత్యమేళా పర్వతగిరి విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించబడింది. అన్ని ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల నుండి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తయారుచేసి తీసుకువచ్చిన కృత్య నమూనాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథు లుగా పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి గాయపు లింగారెడ్డి, పర్వతగి రి సబ్ ఇన్స్పెక్టర్ భోగం ప్రవీణ్, కొంకపాక పర్వతగిరిల కాంప్లెక్స్ హెడ్మాస్టర్ లు అల్లందాసు. బిక్షపతి పాక రమేష్ బాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధనను సులభతరం చేసి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించడానికి కృత్యాధార బోధన తోడ్పడుతుందని అన్నారు. కృత్యనమూ నాలు తయారు చేయడానికి కృత్య మేళాల నిర్వహణ దోహదపడతాయని అన్నారు. సోమవారం రోజున ప్రదర్శించబడిన కృత్యా నమూనాలన నుండి 8 కృత్య నమూ నాలను ఎంపిక చేసి జిల్లాస్థాయికి పంపించడం జరుగుతుందని మండల విద్యాశాఖ



అధికారి గాయపు లింగారెడ్డి తెలిపారు. కృత్య నమూనాలు ఎంపిక చేయడానికి న్యాయ నిర్ణయితలుగా స్టేట్ రిసోర్స్ పర్సన్ లు అయిన టి. శ్రీధర్ గౌడ్, బి. కుమారస్వామి, పర్వతగిరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అయిన మడత భాస్కర్, మనోహర్, శాంతి కిరణ్ లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులుసీఆర్పి లు రజిత, సంధ్య,లోకేష్ ఎమ్మార్సి సిబ్బంది శిల్ప, జయరాజ్ సారయ్య పాల్గొన్నారు.

# సింగరేణి అభివృద్ధి చెందితే ఉద్యోగులు అభివృద్ధి చెందినట్లే

• భూపాలపల్లి ఏరియా జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి

**భూపాలపల్లి, ఆగస్టు 18 (జనంసాక్షి):** సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తునటువంటి మల్టీ డిపార్ట్మెంటల్ అవగాహన సదస్సు సమావేశాలలో భాగంగా కేటీకే 1 ఇంక్లైన్ భూగర్భ గని నందు ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఏరియా జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి, పని గంటలు పెంచుతూ ఎస్ డి ఎల్ యంత్రాలను, నడపాలని భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించాలని అన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని, ప్రతి ఉద్యోగి సక్రమంగా పని చేస్తూ వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతూ, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఏ ఇతర ప్రభుత్వ సంస్థలో లేని విధంగా సింగరేణి సంస్థలో ఉద్యోగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తు న్నాం విధులకు హాజరు కానీ ఉద్యోగులను కంపెనీ నుంచి తీసివేసే ప్రక్రియ కొనసాగుతుందని విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి కార్మికుడు విధులకు హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. మహిళల కోసం ప్రత్యేకంగా త్వరలో కేటీకే 5 ఇంక్లైన్ గని నందు ప్రత్యేకంగా ఒక డిస్టిక్ కేటాయించి బొగ్గు ఉత్పత్తిలో భారీ తోడ్పాటు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జిఎం. కవీంద్ర ఎ జీఎం ఐఈ డి జోతి ఎ జీఎం ఈఎం, మాల ఎర్రన్న, డీజీఎం క్వాలిటీ, కృష్ణ ప్రసాద్,ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, ఫైనాన్స్ మేనేజర్ ఉపేందర్



,సీఎంఓఐ ప్రెసిడెంట్. నజీర్, కేటీకే 1 ఇంక్లైన్ మేనేజర్ తిరుపతి సంక్షేమ అధికారి వేల్పుల కిషోర్, ఏఐటియుసి బ్రాంచ్ సహాయ కార్యదర్శి శ్రీనివాస్, ఐ ఎన్ టి యు సి బ్రాంచ్ ఉపాధ్యక్షులు బి.మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.కేటాయించి లేని లో ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జిఎం. కవీంద్ర, ఎ జీఎం ఐ.ఈ. డి . జోతి, ఎ జీఎం ఈ ఎం, మాల ఎర్రన్న, డీజీఎం క్వాలిటీ, కృష్ణ ప్రసాద్,ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి. ఫైనాన్స్ మేనేజర్ నరేష్ ,సీఎంఓఐ ప్రెసిడెంట్. నజీర్, కేటీకే 6 ఇంక్లైన్ మేనేజర్. సంపత్, సంక్షేమ అధికారినీ, దీపా పొద్దార్, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి, మోట పలుకుల రమేష్, ఐఎన్టియుసి బ్రాంచ్ సెక్రెటరీ ,బొడ్డు అశోక్ పాల్గొన్నారు.

## మాభూమి విషయంలో ఆరోపణలు అవాస్తవం

**కాసిపేట ఆగస్టు 18(జనంసాక్షి):** మాభూమి విషయంలో జనప మల్లమ్మ తమపై చేసిన ఆరోపణలు సరైంది కాదని వారితో మాకు ప్రాణహాని ఉందని బాధిత మహిళ జనప అల్లిక అన్నారు. సోమవారం కాసిపేట మండల కేంద్రంలోని కాసిపేట ప్రెస్ క్లబ్ భవనం వద్ద జనప అల్లిక ఆమె కుటుంబ సభ్యులు స్థానిక గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కాసిపేట గ్రామ పంచాయతీ శివారులోని సర్వే నెంబర్ 213లో గల రెండు ఎకరాల భూమిపై మల్లమ్మ మాపై చేసిన ఆరోపణలు అవాస్తవమని న్యాయంగా ఆ భూమి మాదేనని మోకపై సాగులో మేమే ఉన్నామని తెలిపా రు. స్థానిక నాయకుల ప్రోద్బలంతో మా భూమిని ఆక్రమించాలని దాడులు చేయిస్తున్నారని అన్నారు. గొడవకు సంబంధం లేని రత్నం ప్రదీప్, రత్నం లక్ష్మణ్, గోమాస సుధాకర్, కవితలపై కావాలని వారి



పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేరేడుపల్లి గ్రామంలో పడకేసిన పారిశుధ్యం



**శాయంపేట, ఆగస్టు 18 (జనంసాక్షి):** శాయంపేట మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో పారిశుధ్యం లోపించింది. వర్షాలు కురవడం వలన ఇండ్ల చుట్టూ నీళ్లు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. వీటివల్ల ప్రజలు జ్వరాలు బారిన పడే అవకాశం లేకపోలేదు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని, దోమల మందు పిచికారి చేయడం వంటి పారిశుధ్య పనులను చేపట్టకుండా పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్తను సేకరించే ట్రాక్టర్ కూడా రావడం లేదని, చెత్తాచెదారం ఎక్కడికక్కడే నిలిచిపోయి దుర్వాసన వస్తుందని వాపోయారు. గ్రామంలోని కొన్ని వార్డుల్లోడ్రైనేజీ వ్యవస్థ లేక వర్షాలు పడితే ఇండ్లలోకి నీరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు ..వెంటనే స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి సైడ్ కాలువల నిర్మాణాలు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని లేకపోతే గ్రామస్తులు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కోతులు, కుక్కల
## బెడద రక్షణకు చర్యలు తీసుకోవాలి



**కాళేశ్వరం , ఆగస్టు 19 (జనంసాక్షి):** భూపాలపల్లి జిల్లా కాళేశ్వర క్షేత్రంలో కోతుల సమూహాలు,వీధి కుక్కల బెడద ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. క్షేత్రంలోని స్థానికులతో పాటు నిత్యం ఆలయ దర్శనానికి వచ్చే భక్తులపై కోతులు,కుక్కల గుంపులు సృష్టిస్తున్న నానా హంగామాతో స్థానికులతో పాటు నిత్యం ఆలయ దర్శనానికి వచ్చే భక్తులు బెంబేలెత్తు తున్నారు.ఆలయంలో సోమవారం కోతుల మూకలు రెచ్చిపోయి ఓ భక్తుడి పై పడి గాయపరిచాయి. స్థానికంగా ఇండ్లలో ఉన్న వృద్ధులను,చిన్న పిల్లల ను కోతులు,కుక్కల గుంపులు గాయపర్చడం లాంటి వికృత చేష్టలు క్షేత్రం లో నిత్యకృత్యంగా మారాయి.వీటి బెడద కారణంగా పాఠశాలకు వెళ్ళే విద్యార్థులు ఇండ్ల నుండి బయటకు వెళ్ళేందుకు జంకుతుండగా ప్రధాన రహదారిపై కాలినడకన రాకపోకలు సాగించే భక్తుల వెంట పడి మరీ దాడి చేస్తున్నాయి. గ్రామంలో కోతుల సమూహాలు ఇండ్ల పైకి చేరి ఇంటి పైకప్పు పెంకులు,రేకులను హంగామా సృష్టించి చిందర వందరకు పాల్పడి ఇంటిలో ఉన్న వ్యక్తులను గాయపర్చడం లాంటి వికృత చేష్టలకు పూనుకుం టుండగా వీధి కుక్కల గుంపులు రాత్రింబవళు ళ్ళ వీధుల్లో సంచరిస్తూ వీధుల వెంట వచ్చిపోయే వారిపై వెంట పడి దాడికి పాల్పడుతున్నాయి.క్షేత్రంలో భీభత్సం సృష్టిస్తున్న కోతులు,కుక్కల బెడద తగిన రక్షణ కల్పించి శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు,భక్తులు అధికారులను కోరుతు న్నారు.

## జిల్లాలో యూరియా కొరతను తక్షణమే తీర్చాలి

- కొండపల్లి రామచందర్ రావు టిడిపి మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్



**మహబూబాబాద్ బ్యూరో, ఆగస్టు 18(జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లాలో వర్షాలు సమృద్ధిగా పడుతున్న ప్రస్తుత తరుణంలో వరినాట్లు చివరి దశకు వచ్చి పత్తి, మొక్కజొన్న పంటలకు కావలసిన యూరియా లభించక ప్రాథమిక సహకార సంఘాలు,ఆగ్రోస్ కేంద్రాలు, ఫెర్టిలైజర్స్ షాపుల చుట్టూ రైతులు తిరుగుతూ తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారని, ప్రస్తుత సీజన్లో రైతులకు ఎంత యూరియా అవసరమో అంచనా వెయ్యటంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని ,దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలని తెలిపారు. రైతులు ఉదయం నుంచి రాత్రి వరకూ లైన్ లలో నిలబడిన ఒక్క బస్తా కూడా దొరటం లేదని,చెప్పులను లైన్ లలో పడుతూ ప్రభుత్వం పై నిరసన తెలుపుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం పై ,కేంద్రం రాష్ట్ర ప్రభుత్వంపై ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలయాపన చేస్తూ , రైతుల పాలిట శాపంగా మారారని అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై వత్తిడి తెచ్చిరైతులకు అవసరమైన యూరియా వెంటనే సరఫరా చేయాలని లేనియడల తెలుగుదేశం పార్టీ రైతులతో కలసి ప్రభుత్వం పై నిరసనలు ,ధర్నాలు చేస్తూందని హెచ్చరించారు.

## మారేడు కొండ చెరువు రోడ్డుకు మరమ్మత్తులు

- ఎస్ఐ చల్ల రాజు



**ములుగు/వెంకటాపూర్,ఆగస్ట్18(జనంసాక్షి):** గత రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్నటువంటి బారీ వర్షానికి వెంకటాపూర్ మండలం మారేడు కొండ చెరువు లక్ష్మీదేవిపేట గ్రామ పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి మారేడు కొండ చెరువు వద్ద ఇటీవల నూతనంగా నిర్మించినటువంటి బ్రిడ్జి పక్కన కొంతమంది ప్రయాణికుల యొక్క రాకపోకలు ఇబ్బందికరంగా మారడంతో వారి సమస్య తెలుసుకొని స్థానిక ట్రాక్టర్ యజమానుల యొక్క సాయంతో ఎస్ఐ చల్ల రాజు రోడ్డు మరమ్మతు పనులు చెప్పించడం జరిగింది.

## సీజనల్ వ్యాధుల నివారణకు పశువైద్య శిబిరాలు

- మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తిర్మల సమ్మయ్య



**కాటారం ఆగస్టు 18 (జనంసాక్షి):** పశు సంపద వృద్ధితో రైతులతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని కాటారం వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య పేర్కొన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నాలుగు మండలాల పశు వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో గల పశువుల వివరాలు,వర్షాకాలంలో పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల గురించి తెలుసుకున్నారు.అనంతరం మాట్లాడుతూ మార్కెట్ కమిటీ తరుపున పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. డాక్టర్లు రాజబాబు, ధీరజ్, భరత్ సమీక్షలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా మార్కెటింగ్ అధికారిగా భాద్యతలు స్వీకరించి కాటారం మార్కెట్ యార్డు ను సందర్శించిన ప్రవీణ్ కుమార్ ను శాలువాతో సన్మానిం చారు. సెక్రటరీ లా షరీఫ్, డైరెక్టర్లు మహేష్ తిరుపతి రావు,పిలమరి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా నల్ల వాగు వంతెన



**కాళేశ్వరం , ఆగస్టు 19 ,(జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కాళేశ్వరం మద్దులపల్లి ప్రధాన రహదారిపై నల్ల వాగు వంతెన ప్రమాదకరంగా మారింది. ఇసుక క్వారీలకు వెళ్లే లారీలు ఈ రహదారి కుండానే వెళుతుండడంతో రహదారి బాగా దెబ్బతింది. అలాగే వంతెన ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉంది. ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేపట్టాలని మద్దులపల్లి గ్రామానికి చెందిన పోతుల మహేందర్ డిమాండ్ చేశారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**నల్లబెల్లి, ఆగస్టు 18 (జనంసాక్షి):** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నింటినీ ప్రజలకు అందేల మాధవరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చార్ల శివారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘుపతిరావు, ఉపాధ్యక్షుడు కొమురారెడ్డి, కార్యదర్శి జెట్టి రామ్మూర్తి, మండల నాయకులు సంపత్ రెడ్డి, బొసింగ్, రఘుపతి, అశోక్, ఉపేందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు మహేష్, సంపత్ రెడ్డి, తిరుపతి, రమేష్, సుమన్, మోహన్ పాల్గొన్నారు.

## ఘనంగా జాన్సమ్మ జన్మదిన వేడుకలు



**పెద్దవంగర, ఆగస్టు 18(జనంసాక్షి):** టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం అట్టహాసంగా జరిగాయి. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పండ్ల, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముద్దసాని సురేష్ మాట్లాడుతూ నిరుపేదల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే వ్యక్తిని, పెద్ద వంగర మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితో కలిసి అధిక నిధులు తీసుకువస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రంగు మురళి, కాంగ్రెస్ నేతలు ముత్యాల పూర్ణచందర్, బానోత్ గోపాల్, సీతారాం నాయక్, చిలుక సంపత్, కందుల యాగరాజు, మనపురం శ్రీనివాస్, చిలక దేవేంద్ర, బెడుద మంజుల, అన్నపురం కిషోర్, అనపురం వినోద్, మహమ్మద్ రఫీ, సుంకర్ అంజయ్య, లింగమూర్తి, ఉప్పలయ్యపాల్గొన్నారు.

## స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో
## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**రాయపర్తి,ఆగస్టు 18(జనంసాక్షి):** మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన స్వామి వివేకానంద యూత్ సభ్యుల్లో ఒకరైన చెన్నబోయిన మధు తండ్రిచెన్నబోయిన నర్సయ్య ఇటీవల మరణించగా ఆయన కుటుంబానికి స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో యూత్ వ్యవస్థాపక అధ్యక్షులు ముద్రబోయిన శ్రీనివాస్,అధ్యక్షులు ముప్పిడి మహేష్,ఉపాధ్యక్షులు చెనబోయిన విజయ్, సలహాదారులు చెన్నబోయిన సారయ్య,కుమార్,యాకయ్య,కార్యవర్గ సభ్యులు చెనబోయిన సురేష్,మహేష్,సాగర్,యూత్ మాజీ అధ్యక్షులు కత్తి శరత్, చెన్నబోయిన దిలీప్,కుటుంబ సభ్యులు శ్రీనివాస్,మధులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

- 20 వ తేదీన నిర్వహించబడును
- ప్రిన్సిపాల్ రెహ్మాన్




**భీమదేవరపల్లి:ఆగస్టు18(జనంసాక్షి):** భీమదేవరపల్లిమండలం ముల్కనూర్ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రెహ్మాన్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ స్పాట్ అడ్మిష న్లు బుధవారం రోజున నిర్వహించబడతాయని అన్నారు.ఆసక్తి ఉన్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు 20 వ, తేదీన పాఠశాలను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థినుల కోసం హాస్టల్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందని తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు మెరుగైన వనరులను అందించే ఉద్దేశంతో,ఈ అవకాశం వినియో గించుకోవాలని ఆయన సూచించారు.

# ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలు



**తొర్రూరు, ఆగస్టు 18 (జనం సాక్షి) :** టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం డివిజన్ కేంద్రంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. తొర్రూరు మాజీ సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు పెదగాని కళావతి– సోమయ్య ఆధ్వర్యంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సమక్షంలో కేక్ కట్ చేశారు. గజమాలతో సత్కరించారు. మహా అన్నదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు తూనం శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మహిళ కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలు పింగిలి ఉషల ఆధ్వర్యంలో పార్టీ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. గుర్తురు గ్రామానికి చెందిన ఎల్లా గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, కందాడి అశోక్ రెడ్డి, మాచర్ల ప్రభాకర్, బానోత్ అభిరామ్ ల ఆధ్వర్యంలో ఝాన్సీ రెడ్డిపై రూపొందించిన ప్రత్యేక గీతాన్ని ఆవిష్కరించారు. పట్టణంలో గుడిసెలు వేసుకున్న పేదలకు బట్టల పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిపిసిసి మాజీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వరరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్,పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పింగిలి ఉష, నాయకులు చాపల బాపురెడ్డి, పెదగాని సోమయ్య,డాక్టర్ సోమేశ్వరరావు,గంజి విజయపాల్ రెడ్డి, చిత్తలూరి శ్రీనివాస్, అచ్చిరెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, సురేందర్ రెడ్డి,అశోక్ రెడ్డి, నల్ల మాస సమ్మయ్య, గజానంద్, సురేందర్ రాజు,దొంగరి రేవతి శంకర్,రాజేష్ యాదవ్,రామ్ రెడ్డి,రవీంద్రాచారి, తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎమ్మెల్యే దొంతి



**నర్సంపేట ఆగస్టు 18 (జనం సాక్షి) :** నర్సంపేట పట్టణంలోని ఒకటో వార్డులో ఘనంగా దొంతి మాధవరెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు అనంతరం వార్డు ఇంచార్జ్ లక్కర్స్ రమేష్ మాట్లాడుతు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పుట్టినరోజు సందర్భంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలోసీనియర్ నాయకుడు గొల్లపెల్లి కిష్టయ్య, పట్టణ ప్రచార కార్యదర్శి బిట్ల మనోహర్. నర్సంపేట పట్టణ కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ శెట్టి రాజు, కందికట్ల వీరేష్ (న్యాయవాది) బత్తుల శివకృష్ణ, శిరంశెట్టి సురేష్, సోమ వెంకట్, బోళ్ల చిన్న శ్రీరామ్ శెట్టి భరత్, పులిపాక రాజేష్ రాజు, సద్దాం గద్ద కనకయ్య, కూచన లడ్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకురాలు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు నీట మునిగిన మిర్చి నారుమళ్ళు



**వాజేడు,ఆగస్టు18(జనం సాక్షి):** మండలంలో చింతూరు గ్రామంతో పాటు పలు గ్రామాల్లో మిర్చి నారుమళ్లు వర్షపు నీటిలో నిండా మునిగాయి. గత రెండు సంవత్సరాలుగా మిర్చి పంట రైతుల కంట కన్నీరు పెట్టిస్తుంది. గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం నానా కష్టాలు పడి వేల రూపాయలు పెట్టి గింజలు కొని నారుమళ్లలో పెడితే ఈ భారీ వర్షాలతో మిర్చి నారుమళ్లు నీటిలోనే ఉండడంతో తీవ్ర నష్టం జరుగుతుందని మిర్చి రైతులు దిగులు పడుతున్నారు

## కోటగుళ్లలో భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ పూజలు



**గణపురం, ఆగస్టు18( జనం సాక్షి ):** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో శ్రావణమాసం చివరి సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకొని భూపాలపల్లి సీఐ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వరునికి పూలమాలలు సమర్పించి పూజ లు నిర్వహించారు.

## కోటగుళ్లలో ఘనంగా నందీశ్వరుని 2వ వార్షికోత్సవం

### గణపేశ్వరునికి నందీశ్వరుడి కి రుద్రాభిషేకం



**గణపురం, ఆగస్టు18( జనం సాక్షి):** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో శ్రావణమాసం చివరి సోమవారం నందీశ్వరుని రెండవ వార్షికోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలను ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు, సాయిబాబా దేవాలయ అర్చకులు వినయ్ లు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. 2023 ఆగస్టు 18 న నిజామాబాద్ సిపి పోతరాజు సాయి చైతన్య కీర్తి దంపతుల ఆధ్వర్యంలో నందీశ్వరుని ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది. ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం రెండవ వార్షికోత్సవం కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందీశ్వరుని కి గణపేశ్వరునికి రుద్రాభిషేకం త్రివేణి సంగమం జలాభిషేకం నిర్వహించారు. అభిషేకం అనంతరం పూలమాలలో పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి నందీశ్వరుని వార్షికోత్సవంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు భక్తులకు ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు మహిళలకు అమ్మవారి గాజులను అందజేశారు. ఆలయంలో నందీశ్వరుని ప్రతిష్టించిన నిజామాబాద్ సిపి పోతరాజు సాయి చైతన్య, కీర్తి దంపతులకు కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 18(జనంసాక్షి) :** రాష్ట్రంలో భారీ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో మరియు ములుగు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలలో మరియు గోదావరి పరివాహక ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్బంగా వరద ప్రవాహం ఉన్న వంతెనలు, కల్వర్ట్, రహదారులపై నుండి ప్రజలు దాటవద్దని, శిథిల వ్యవస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండద్దని, తడిగా ఉన్న కరెంట్ పోల్స్, ట్రాన్సఫర్స్ తాకవద్దని, గ్రామాలలో చేపల వేటకు ఎవరు వెళ్ళవద్దని మరియు అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరు బయట రావద్దని, వరద ప్రవాహల వద్ద బందోబస్త్ ఉన్న పోలీస్ సిబ్బంది సూచనలు పాటించి పోలీసు వారికి సహకరించాలని సూచించారు. అదే విధంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని వాగులు, చెరువులు, కుంటల యొక్క పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని, ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్బంగా జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు, ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైన వాటిని ఎదుర్కొనేందుకు జిల్లా పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉందని, ముంపు ప్రాంతాల ప్రజలకు తక్షిణ సహాయం కోసం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు (ఎస్డీఆర్ఎఫ్), జిల్లా విపత్తు ప్రతిస్పందన దళాలు (డిడిఆర్ఎఫ్) బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది అని తెలియచేశారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే ప్రజలు పోలీస్ శాఖ సహాయం తీసుకోవాలని, డైల్ 100 ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి


సాగు చేసుకుంటున్న భూమిలో తాను 25 సంవత్సరాల క్రితం టేకు చెట్లు నాటి సంరక్షించానని, వాటిని తొలగించి వ్యవసాయ సాగు చేసుకునేందుకు అనుమతులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ మాజీ సర్పంచ్ మంద అనిత తన దరఖాస్తులో తమ గ్రామంలోని ఎర్రకుంట చెరువు పై ఆధారపడి రైతులు, మత్స్యకారులు జీవించేవారని, కొంతమంది రియల్ ఎస్టేట్ వారు అక్రమంగా చెరువుకి గండి కొట్టి భూముల ఆక్రమణకు పాల్పడడంతో ఎంతో నష్టం జరుగుతుందని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి చెరువు పునరుద్ధరించి రైతులను, మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం డోంగర్ గావ్ గ్రామానికి చెందిన వైశాలి తన కుమారుడు ఇచ్చోడలోని గురుకుల బాలుర పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడని, తనని జిల్లాలోని కాసిపేట, ఇతర గురుకులాలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టడానికి చెందిన దూట లక్ష్మణ్ తాను గతంలో కొనుగోలు చేసిన భూమికి భూ భారతి చట్టం ప్రకారం పట్టా మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విజ్ డమ్ విద్యార్థుల ఎంపిక



**నర్సంపేట ఆగస్టు 18 ( జనం సాక్షి) :** ఇంటర్నేషనల్ స్కూల్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో వరంగల 'లోని ఓ సిటీ గ్రౌండ్ లో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో విజ్ డమ్ విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ జావేద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20, 21న గురుకుల విద్యాపీట్ హై స్కూల్, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లాలో జరిగే పోటీలలో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఎ. చందన, 9వ తరగతికి చెందిన బి. రాంప్రసాద్ పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబరచి జాతీయ స్థాయిలో రాణించడం తమ లక్ష్యమని విద్యార్థులు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభను కనబరచిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ జహంగీర్, అకాడమిక్ ఇంచార్జి నాజియా ఇక్బాల్, వైస్ ప్రిన్సిపల్ ప్రకాష్, ప్రీ స్కూల్ ప్రిన్సిపల్ ఫహీం సుల్తాన, కోచ్ రాజేష్, మధు, ప్రశాంత్ కుమార్, రియాజ్ లతో పాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## పాఠశాలలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలు



**భూపాలపల్లి, ఆగస్టు 18 (జనం సాక్షి):** ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలు వివరాల్లోకి వెళితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా, భూపాల్ పల్లి మండల్ , కమలాపూర్ గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాలలో దాదాపుగా 100 మంది విద్యార్థులు ఉంటారు పాఠశాల ప్రాంగణం లోని చెట్లు భారీగా పెరిగి చెట్ల మధ్యలో నుంచి విద్యుత్ తీగలు ఆనుకొని ప్రమాదంగా ఉన్నాయి. అసలే భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో అటువైపు విద్యార్థులు గమనించకుండా వెళితే భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నట్టుగా విద్యార్థుల తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. చెట్ల కొమ్మలను తొలగించి సమస్యను పరిష్కరించగలరని సంబంధిత అధికారుల ను స్థానికులు కోరుచున్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే దొంతి జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసిన నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్...
- చెన్నారావుపేటలో అన్నదానం



**చెన్నారావుపేట, ఆగస్టు 18 (జనం సాక్షి):** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం చెన్నారావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్వగ్రామమైన అమీనాబాద్ లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్, యూత్ మండల అధ్యక్షులు బండి హరీష్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు భూక్య గోపాల్ నాయక్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేష్, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నన్నె బోయిన రమేష్ యాదవ్, నర్సంపేట మార్కెట్ డైరెక్టర్ లు కోరె కుమారస్వామి, చీర అశోక్, చెన్నారావుపేట సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, యూత్ మండల అధ్యక్షులు బండి హరీష్, నాయకులు మంద యాకయ్య గౌడ్, బొంత శ్రీనివాస్, కుండె కుమారస్వామి, మెంతుల రమేష్, పోలెపల్లి బిక్షపతి, చెవ్వ వెంకటేశ్వర్లు, జోరు వీరయ్య, రూపిక శ్రావణ్ కుమార్, భూక్య రమాబాయి మైబూసింగ్, భూక్య భాస్కర్, కందిక ప్రవీణ్ కుమార్, వనపర్తి శోభన్, గుగులోతు ఈర్య, బాదావత్ మేఘ్యా నాయక్, ధారావత్ కిషన్, రాములు, పలు గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నెన్నెల తహసీల్దార్‌గా శ్రీనివాస్



**బెల్లంపల్లి, ఆగష్టు 18, (జనంసాక్షి)** : నెన్నెల మండల తహసీల్దార్ గా పిప్పరి శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తహసీల్దార్ గా పని చేసిన ముద్దమళ్ళ జ్యోతి కేవలం నెల రోజుల లోపే గుండెపోటుతో మృతి చెందారు. ఆమె స్థానంలో స్థానంలో మంచిర్యాల కలెక్టరేట్ లో విధులు నిర్వహిస్తున్న పిప్పరి శ్రీనివాస్ నూతన తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా నూతన తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. రైతుల సమస్యలు, ఇతర ధ్రువీకరణ పత్రాల జారీలో పారదర్శకత పాటిస్తానని అన్నారు. కార్యాలయంలో పనుల కోసం దళారులను ఆశ్రయించవద్దని ఎవరైనా సరే నేరుగా తనను సంప్రదించి పనులు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. నూతన తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ ను నాయబ్ తహసీల్దార్ ప్రకాష్, గిర్దవర్ సులోచన రాథోడ్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



## తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నెరడిగొండ ఆగస్టు18(జనంసాక్షి):** తీజ్ పండుగ గిరిజన బంజారాల ప్రత్యేక పండుగ అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం రోజున మండల కేంద్రంలో గల కెజిబివి పాఠశాలలో నిర్వహించిన బంజారా తీజ్ నిమజ్జనం ఉత్సవాలకు ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. విద్యార్థినిలతో కలిసి తీజ్ తెంపి వారితో కలిసి సాంప్రదాయ పాటలపై ఉత్సాహంగా నృత్యాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్ తుల శ్రీనివాస్ రవీందర్ రెడ్డి శివారెడ్డి దేవేందర్ రెడ్డి రాథోడ్ సురేందర్ జాదవ్ మహేందర్ సాబ్లే ప్రతాప్ సాబ్లే సంతోష్ మేర్సింగ్ పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**డాక్టర్ రాజా రమేష్**



**నిర్మల్ రూరల్,ఆగస్టు18(జనం సాక్షి)** : హెచ్ఐవి,ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా హెచ్ఐవి,ఎయిడ్స్ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ రాజా రమేష్ తెలిపారు. సోమవారం నిర్మల్ గ్రామీణ మండలం రత్నాపూర్ కాండ్లీ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఐవి,ఎయిడ్స్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజా రమేష్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధి గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. విద్యార్థి దశ నుండే విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నట్లయితే ఆరోగ్యంతో పాటు అన్ని రంగాలలో విజయం సాధించవచ్చు అని తెలిపారు. అనంతరం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవి,ఎయిడ్స్ వ్యాధిపై త్వరలోనే క్విజ్,అలాగే పరుగు పందెం పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి పంపడం జరుగుతుందని, రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విద్యార్థులను జాతీయ స్థాయిలో పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత,ఐ సి టి సి కౌన్సిలర్లు సుదర్శన్,ఎల్లేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ఖానాపూర్ ఆగస్టు 18 (జనం సాక్షి)** : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ సుజాత రెడ్డి అన్నారు. సోమవారం మండల ప్రత్యేక అధికారి జీవరత్నం తో కలిసి ఆమె మండలంలో పర్యటించారు. సదర్మాట్ ఆనకట్టను సందర్శించిన అనంతరం మండలంలోని నది పరివాహక గ్రామాలైన బావాపూర్ (కె), దిలావర్పూర్, బాదనకుర్తి, సుర్జాపూర్, గోడలపంపు, గోసంపల్లి, తదితర గ్రామాలలో పర్యటించారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేస్తున్నారని నీటి ఉధృతి గోదావరి తీరంలో పెరుగనున్నట్లు ప్రజలకు వివరించారు. ప్రజలు, రైతులు, జాలర్లు, పశువుల కాపరులు ఎట్టి పరిస్థితిలో నది తీరంలోకి వెళ్ళకూడదని సూచించారు. పురాతన నివాస గృహాలలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా గ్రామ కార్యదర్శికి వెంటనే తెలియజేయాలని లేని పక్షంలో మండల స్థాయి అధికారులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా సూచించారు. గ్రామాలను సందర్శించిన వారిలో ఎంపీడీవో రమాకాంత్, ఎంపీఓ రత్నాకర్ రావులతో పాటు ఆయా గ్రామాల కార్యదర్శిలు, తదితరులు ఉన్నారు.

## ముంపు ప్రాంతాల్ని సందర్శించిన హరీష్ గౌడ్



**బెల్లంపల్లి, ఆగష్టు 18, (జనంసాక్షి)** : బెల్లంపల్లి నియోజక వర్గం నెన్నెల మండలంలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ముంపుకు గురైన పంట పొలాలను సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశానుసారం గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్ గౌడ్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 500 ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లిందని, వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన పత్తి చేలు, పంట పొలాలను ప్రత్యక్షంగా సందర్శించి, రైతుల వద్ద నుండి పూర్తి వివరాలు త్వరలోనే సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా తగిన పరిహారం అందించేందుకు కృషి చేస్తామని, ఈ కష్టకాలంలో ప్రభుత్వం రైతుల వెన్నంటే నిలబడుతుందని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు కంపెల రాజశేఖర్, చిరంజీవి, వెంకటేష్, సంతోష్, రాజేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## వీధి కుక్కలను ప్రత్యేక కేంద్రానికి తరలించాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్ణపు సోమయ్య డిమాండ్**



**మహబూబాబాద్ బ్యూరో, ఆగస్టు 18(జనం సాక్షి):** సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వీధి కుక్కలను ప్రత్యేక కేంద్రానికి తరలించాలని పారిశుధ్య సమస్య పరిష్కరించాలని తదితర డిమాండ్లతో మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్ణపు సోమయ్య మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణంలో ప్రతి వీధిలో కుక్కలు గుంపు చిన్నపిల్లలు, వృద్ధులు వీధి నుండి వెళుతుంటే వారి వెంటపడి కరుస్తున్నాయని అన్నారు. అదేవిధంగా కుక్కలు కుక్కలు కరుసుకొని పుండ్లు అయ్యి వాసన వస్తున్నదని వెంటనే వీధి కుక్కలను ప్రత్యేక కేంద్రాలకు తరలించాలని డిమాండ్ చేశారు. రోజురోజుకు జన సమూహంతో పెరుగుతున్న ఈ పట్టణంలో పారిశుధ్య సమస్య రోజురోజుకు బాగా పెరుగుతుందని మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వర్షాకాలం వచ్చింది వానలు బాగా కురుస్తున్నాయనీ, కాలువలలో చెత్తను తీయక నీరు నిలిచి దోమలు చేరి డెంగ్యూ లాంటి విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉన్నదని అన్నారు. మున్సిపాలిటీలోని 36వార్డులకు ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోరు కాబట్టి ప్రత్యేక డ్రైవ్ కింద వంద మంది సిబ్బందిని పెట్టి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. వర్షాలు పడడం వలన రోడ్లు గుంతలు పడ్డాయి రోడ్డు నుండి పోయే పాదాచారులకు ఇబ్బంది కలుగుతుందని వెంటనే మొరం పోసి పూడ్చాలని కోరారు. అదేవిధంగా కోతుల బెడద బాగా ఉండి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు లేని వేదల పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి. పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్. వన్ టౌన్ కార్యదర్శి రావుల రాజు, పార్టీ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం స్కీమున్ వెంటనే అమలు చేయాలి

**ఎంసిపిఐయూ డిమాండ్**



**బెల్లంపల్లి, ఆగష్టు 19, (జనంసాక్షి)** : రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం బెల్లంపల్లి తాసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణిలో నాయబ్ తాసిల్దార్ హమీద్ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కుతుందని రాజీవ్ వికాసం పేరిట యువతను మోసం చేసిందని ఆరోపించారు. యువతకు మాయమాటలు చెప్పి ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోమని ఆన్లైన్లో ఒక్కొకరు 100 నుండి 150 రూపాయల వరకు ఖర్చు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని కోట్ల రూపాయలు యువత వృధా ఖర్చు చేసిందన్నారు. 50 వేల నుంచి ఐదు లక్షల వరకు రుణాలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కసారిగా చేతులెత్తేయడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు.



పాలకుర్తి మండలంలో నివాళులర్పించిన ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పాలకుర్తి, ఆగస్టు 18(జనం సాక్షి)



ఏటూరు నాగారం మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి



మర్రిపెడ మండలం గుండెపూడి గ్రామం కేంద్రంలో..



10 మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అదనపు కలెక్టర్ రెవెన్యు కె.అనిల్ కుమార్‌లు హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. **మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 18 (జనంసాక్షి):**



**చిట్యాల ఆగస్టు 18 (జనంసాక్షి)** మండల కేంద్రంలో గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా.. ముఖ్యఅతిథిగా గౌడ సంక్షేమ సంఘం చిట్యాల మండల అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్ పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాల్గొన్న పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరకాల, ఆగస్టు 18 (జనం సాక్షి):



**గోవిందరావుపేట, ఆగస్టు 18(జనంసాక్షి)**

పసర చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలను, పసర రాంపూర్ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు రాజు గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం సర్వాయి పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించగా ముఖ్య అతిధిగా జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు.



అన్నారం గీత కార్మిక సొసైటీ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు

**మహదేవపూర్, ఆగస్టు 18 (జనంసాక్షి)**

## సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకం

### భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సామాజిక న్యాయం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, వివిధ శాఖల అధికారులు, గౌడ సంఘం నాయకులు పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 18 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ డా సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఖానాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద గల పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ఖానాపూర్ ఆగస్టు 18 (జనం సాక్షి)**

## లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కోర్స నరసింహ మూర్తి



**నూగూర్ వెంకటాపురం ఆగస్టు 18 (జనంసాక్షి) :** వెంకటాపురం మండల కేంద్రం లో ని ప్రతి గ్రామం లో ప్రజలు భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంత లోతట్టు గ్రామాలలో, గోదావరి పరివాహక ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కోర్స నరసింహమూర్తి అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న తీవ్ర వర్షాల వల్ల సంభవించే విపత్కర పరిస్థితులలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ శబరిష్ స్పష్టం చేసిన ఆదేశాలు ప్రజలు పాటించాలని ఆయన అన్నారు. వరద ప్రభావం ఉన్న వంతెనలు, కల్వర్ట్, రహదారులపై నుండి ప్రజలు దాటవద్దని అన్నారు. గ్రామాలలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండవద్దని అన్నారు. తడిగా ఉన్న కరెంటు పోల్స్, ట్రాన్స్ఫార్మర్లని తాక వద్దని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపల వేటకు ఎవరు వెళ్ళవద్దని, అత్యవసర పైపు తప్ప ప్రజలు ఎవరు బయటకు రావద్దనిఅన్నారు. పోలీస్ అధికారుల సూచనలు పాటించి పోలీసు వారికి సహకరించాలని, అత్యవసర పరిస్థితి ఎదురైతే ప్రజలు పోలీస్ శాఖ సహాయం తీసుకోవాలని అన్నారు. అత్యవసరం అయితే డయల్ 100 సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## కల్లు గీత కార్మిక సంఘం పోరాట ఫలితమే ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహం

**ములుగు ప్రతినిధి, ఆగష్టు 18(జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్ హాజరై మాట్లాడుతూ ఏజెన్సీలో అనాదిగా గీత వృత్తి చేస్తున్నా గీత కార్మికుల సమస్యల పైన ముఖ్యమంత్రి తో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయాలని పెండింగ్ లో ఉన్నా 13 కోట్ల ఎక్స్ గ్రేషియాలు తక్షణమే విడుదల చేయాలని, ప్రతి గీత కార్మికునికి టూ వీలర్ బైక్లు





ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. 10 సంవత్సరాల నుండి ఆగస్టు 2 నుండి 18 వరకు ప్రభుత్వం అధికారికంగా పాపన్న జయంతి మరియు వర్ధంతి చేపట్టాలని అలాగే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండపైన పెట్టాలని బస్సు యాత్రకు బైక్ ర్యాలీలు చేపట్టామని, ఆ పోరాటంతోనే గత బిఆర్ఎస్ ప్రభుత్వం పాపన్న జయంతి, వర్ధంతి అధికారికంగా నిర్వహించినట్లు రవిగౌడ్ తెలిపారు. ఇప్పుడు ట్యాంక్ బండ్ పైన విగ్రహం కోసం భూమి పూజ చేయడం కూడ కల్లు గీత కార్మిక సంఘం విజయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పులి నర్సయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రంగు సత్యనారాయణ గౌడ్, పులి రమేష్ గౌడ్, కోటగిరి సురేందర్ గౌడ్, పులి రవి గౌడ్ తో పాటు 100 మంది గీత కార్మికులు పాల్గొన్నారు.

## బాధితులను రిహాబిలిటేషన్‌కు తరలించిన అధికారులు



**మంగపేట ఆగస్ట్ 18(జనంసాక్షి) :** లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ( రిహాబిలిటేషన్) తరలించిన మండలస్థాయి అధికారులు. వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కమలాపురం జెడ్పి పాఠశాలలలో 15 కుటుంబాలలో 60 మందిని తరలించారు.అలాగే నరసింహసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో 16 కుటుంబాలలోని 46 మంది తరలించినట్లు అధికారులు తెలిపారు. అలాగే రానున్న మూడు రోజులపాటు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయాల్లో తప్ప బయటకి ఎవరు రాకూడదని అధికారులు సూచించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ హర్షవర్ధన్ రెడ్డి, తాహసిల్దార్ తోట రవీందర్, ఎంపీడీవో బానోత్ బద్రు, స్థానిక ఎస్సై టీవీఆర్ సూరి పాల్గొన్నారు.

# మొట్టమొదటి బహుజన వీరుడు పాపన్న గౌడ్..

**ఆయన పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలి..**

**భూపాలపల్లిలో ఘనంగా పాపన్న గౌడ్ జయంతి వేడుకలు..**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మొట్టమొదటి బహుజన వీరుడు గోల్కొండ కోటను ఏలిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, ఆయన పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, టిపిసిసి అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ గౌడ్ లు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం తెలంగాణ గౌడ సంఘం జిల్లాకమిటి ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. పట్టణంలో పాపన్న గౌడ్ డిజే పాటలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పాపన్న ఒక సాధారణ గౌడ కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి కనుక అతనికి ప్రజల కష్టనష్టాలన్నీ తెలుసని, అందుకే పాపన్న రాజ్యంలో పన్నులు లేవు. ఖజానా కొరకు అతను జమిందార్, సుబేదార్లపై తన గెరిల్ల సైన్యంతో దాడి చేయించేవాడని, పాపన్న అనేక ప్రజామోద యోగ్యమైన పనులు చేసాడని తెలిపారు. అతని రాజ్యంలో సామజిక న్యాయం పాటించేవారని, తాటి కొండలో చెక్ డ్యాం కూడా నిర్మించాడని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తడుక సుధాకర్ గౌడ్, మాజీ జడ్పిటిసి కంకటి రాజవీరు, జిల్లా నాయకులు ముంజాల రవీందర్ గౌడ్, పెరుమాండ్ల తిరుపతి గౌడ్, ముత్యాల రాజబాబు గౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కుమారస్వామి గౌడ్, వేణు గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**పాపన్న గౌడ్ జయంతి వేడుకలపై అధికారుల నిర్లక్ష్యం : తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్..**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలపై స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పాపన్న గౌడ్ జయంతి వేడుకల కార్యక్రమం తూతూ మంత్రంగా కొనసాగించి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. అధికారికంగా పాపన్న గౌడ్ జయంతి వేడుకల కార్యక్రమాన్ని బహుజన సంఘాల నేతలను ఆహ్వానించి ప్రత్యేకంగా నిర్వహించి ఆయన చేసిన సేవలను కొనియాడాల్సి ఉండగా, నిర్లక్ష్యంగా వ్యవహరించి, పాపన్న గౌడ్ ను అవమాన పరిచేలా వ్యవహరించారని, దీనికి జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని మండిపడ్డారు. అధికారుల తీరు పట్ల తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, వివిధ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరును ఈ సందర్భంగా వారు ఖండించారు. ఈ సమావేశంలో గౌడ సంఘం నేతలతో పాటు వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## జనని హాస్పటల్‌ను సందర్శించిన డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ గోపాల్ రావు



**ములుగు, ఆగస్ట్18 (జనం సాక్షి):** ములుగు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మరియు జిల్లా కీటక జనిత నియంత్రణ ప్రోగ్రాం ఆఫీసర్ తో కలిసి ములుగు పట్టణంలోని జనని ప్రైవేట్ హాస్పిటల్ ను సందర్శించిన డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ రోగులకు అధిక మోతాదు యాంటీబయటిక్లను,స్తిరాయిడ్స్ వాడకూడదని, రక్త పరీక్షలలో అనవసర టెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని యజమాన్యానికి తెలిపారు.జనని హాస్పిటల్ లో పనిచేస్తున్న డాక్టర్ల, ల్యాబ్ టెక్నీషియన్ సర్టిఫికెట్లను,హస్పటల్ యందు వార్డులలో చికిత్స పొందుతున్న రోగుల కేజ్– షీట్స్ , చికిత్స తీరును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కీటక జనిత నియంత్రణాధికారి డాక్టర్. చంద్రకాంత్ పాల్గొన్నారు.

## కేరళలో సీనియర్ జర్నలిస్టుల జాతీయ సమావేశాలు

**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 18 ( జనం సాక్షి ) :**సీనియర్ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో నేడు 19వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కేరళలోని త్రివేంద్రం లో సీనియర్ జర్నలిస్టుల జాతీయ సమావేశాలు జరు గుతాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్)రాష్ట్రఉపాధ్యక్షుడు జగన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19 న త్రివేంద్రం ప్రెస్ క్లబ్ లో ప్రారంభమయ్యే ఈ సమావే శాలు 21వ తేదీ సాయంత్రం ముగుస్తాయని అన్నారు. ఈసమావేశాలను కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభిస్తారని వారు తెలిపారు. ఈ సమావే శాల్లో భాగంగా 19వ తేదీన త్రివేంద్రం ప్రెస్ క్లబ్ లో వివిధ రంగాలకుచెందిన ప్రముఖుల సంఘీభావ సమా వేశం, అంతర్జాతీయ ఫోటో ప్రదర్శన,20, 21తేదీలలో ప్రతినిధుల సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలకు చెందిన 250 మంది సీనియర్ జర్నలిస్టులు ప్రతినిధులుగా సమావేశాలకు హాజరవుతారని, తెలంగాణ రాష్ట్రం నుంచి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తరపున ఐఎఫ్ డబ్ల్యూ జె కార్యదర్శి పులిపలుపులఆనందం,రాష్ట్రఅధ్యక్షులు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుడుతాడి బాబు రావ్ తో పాటు 20 మంది సీనియర్ జర్నలిస్టులు ప్రతి నిధులుగా పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా తెలంగాణ వెటరన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెలక్ష్మణ్ రావు, కోశాధికారి పి శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు సీనియర్ జర్నలిస్టులు ఉడయవర్లు, నంది రాజు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానస్పద స్థితి లో వ్యక్తి మృతి



**నూగూర్ వెంకటాపురం ఆగస్టు 18(జనం సాక్షి):** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో అనుమాన స్పద స్థితి లో వ్యక్తి మృతి చెందిన ఘటన బెస్త గూడెం గ్రామం లో కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం బెస్త గూడెం గ్రామానికి చెందిన గజ్జల బాబురావు తండ్రి లక్ష్మయ్య, వయసు 46 సంవత్సరాలు, కులం నేతకాని, అను వ్యక్తి అనుమాన స్పద స్థితి లో తన ఇంటి వద్ద నే మృతి చెందాడు. అతని తమ్ముడైన గజ్జల సదల బాబు గమనించి వెంటనే పోలీసులకు పిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై కె తిరుపతి రావు గజ్జల సదలబాబు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ...

**చెన్నారావుపేట, ఆగస్టు 18 (జనం సాక్షి):** బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు సోమవారం పంపిణీ చేశారు.మండలంలోని బోడా మాణిక్యం తండా లో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సు నాయక్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి బోడ ఈర్య నాయక్ కు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో మంజూరైన రూ.10 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు వీరన్న నాయక్, సుమన్ నాయక్, నర్సింహ, రాజు, నర్సింగ్, బొజ్జ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ కార్యదర్శి అవార్డు అందుకున్న రాజకు సన్మానం...



**చెన్నారావుపేట, ఆగస్టు 18 (జనం సాక్షి):** జిల్లా ఉత్తమ కార్యదర్శి అవార్డు అందుకున్న పాపయ్యపేట పంచాయతీ కార్యదర్శి కత్తెరపల్లి రాజును కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకట్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శాలువా కప్పి ఘనంగా సన్మానోత్సవం చేశారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ సత్య శారద చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శి కత్తెరపల్లి రాజు జిల్లా ఉత్తమ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు కంచ ప్రభాకర్, చెన్నారావుపేట సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, మండల రవి, కన్నం సందీప్, మేడి వెంకటేశ్వర్లు, కుండె భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**రాయపర్తి,ఆగస్టు 18 (జనంసాక్షి):** రాయపర్తి మండల కేంద్రంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు,అభిమానులు ఘనంగా నిర్వహించారు.మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.వేడుకల అనంతరం సేవా కార్యక్రమాలలో భాగంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.కాంగ్రెస్ నాయకులు,యువజన శ్రేణులు కలిసి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి,పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బిల్లా శివాని రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా టీపీసీసీ మాజీ సెక్రెటరీ బిల్లా సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో వాటర్ క్యాన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, తొర్రూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హమ్యా నాయక్,వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, మండల యూత్ అధ్యక్షులు బొమ్మెర కళ్యాణ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మచ్చ రమేష్, మహిళా నాయకులు వనజారాణి,ఊగ మునీత, నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించవద్దు



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 18 ( జనం సాక్షి ) :** మండలంలోని కృష్ణాజిగూడెంగ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ స్థలలో కుల సంఘాలకు చెందిన కమ్యూనిటీ హల్ నిర్మించవద్దని, గతంలో కేటాయించిన విధంగా ప్రభుత్వ స్థలంలో హెల్త్ సెంటర్ నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాదం రాజేందర్,సిపిఎం పార్టీ మండ ల కార్యదర్శి సాదం రమేష్,బిజెపి గ్రామ శాఖ అధ్యక్షు డు సాదం భీములు, గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ను కోరారు. కృష్ణాజిగూడెం గ్రామంలో హేల్త్ సెంటర్ నిర్మిం చాలని కోరుతూ గ్రామ ప్రజలు సోమవారం జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కు వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009 లో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మరికుంట్ల మార్కొండయ్య దగ్గర నుండి 3ఎకరాల భూమి కొనుగోలు చేసి మాడల్ కాలనీలో ఇందిరమ్మ ఇండ్లకోసం100 ప్లాట్లు చేసి ఇంటి స్థలం లేని నిరుపేదలకు గ్రామంలోని అన్ని పార్టీలతో కలిసి ప్లాట్లపంపిణి చేయగా రోడ్డుకు ముందుభాగంలో గ్రామ పంచాయతీ, పశువుల హాస్పిటల్, హెల్త్ సెంటర్ కోసం, మహిళా భవన్ కోసం ప్లాట్లు తీయడం జరిగిం దని తెలిపారు.ఈ మధ్యలో గ్రామ పంచాయతీ నుండి ఎలాంటి అనుమతి లేకుండా ప్లాట్లలో ఎస్సీ కమ్యూని టీ హల్ కట్టడం కోసం దౌర్జన్యంగా పునాది నిర్మాణం చేపట్టారని అన్నారు. ప్రభుత్వ స్థలంలో కులసంఘాల కమీటి భవనాలు నిర్మాణం చేయవద్దని,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేల్త్ సెంటర్ వెంటనే నిర్మాణం జరిగేవిధంగా చూడాలని ఆర్డిఓకు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాదం రాజేందర్, సాదం రమేష్, సాదం, (కొత్తగోళ్ల)బీమయ్య, సాదం రవి (మాజీ ఉప సర్పంచ్), వడ్లకొండ యాదగిరి, గద్ద కుమార్,సాదం (మచ్చ) వెంకటయ్య, సాదం శ్రీనివాస్, గిరాబోయన లింగయ్య, నిరటి సురేష్, బైరగోని రాంచంద్రం, సాదం రవీందర్, గద్ద రాజు, సాదం పాల వెంకటయ్య, తదిత రులు పాల్గొన్నారు.

# సబ్బండవర్ణాల సమరగీతిక..

# కొండా సురేఖ



> తెలుగు రాజకీయ యవనికపై ఫైర్ బ్రాండ్ పొలిటిషియన్ కొండా సురేఖ. రాజకీయాల్లో కొండా సురేఖ స్టైలే వేరు. ఏ పార్టీలో పని చేసినా వీర విధేయత చూపించే కొండా సురేఖ అంతేస్థాయిలో అవసరమైతే ధిక్కార స్వరాన్ని వినిపించే శక్తిసామార్థ్యాలు కల్గిన నాయకురాలు. ముప్పయి సంవత్సరాల క్రితం ఒక సాధారణ ఎంపీటీసీ, ఎంపీపీగా తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదిగిన తీరు అనన్యసామాన్యం.. అజరామరం. 1995లో రాజకీయ అరంగ్రేటం చేసిన ఒక మహిళ.. 30 ఏండ్ల పాటు రాణించడం అంటే సామాన్యమైన విషయం కాదన్నది సర్వత్రా విదితమే.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటి తెలంగాణ వరకు బీసీ పద్మశాలి సామాజికవర్గం నుంచి కొండా లక్ష్మణ్ బాపూజీ తర్వాత అదే వర్గం నుంచి మంత్రి స్థాయికి ఎదిగిన ఏకైక నేత, బీసీ బెబ్బులి కొండా సురేఖ. ఏ స్థాయిలో ఉన్నా, నిత్యం ప్రజల కోసం పరితపించే ప్రజల మనిషి కొండా సురేఖ. నిత్యం పరిపాలనలో బిజీగా ఉండే మంత్రి కొండా సురేఖ.. మొన్నా ఆ మధ్య ఒక నడి సంధ్యా సమయాన పెద్దపల్లి జిల్లా పర్యటనలో తన అధికారిక వాహనంలో వెళ్తుండగా (బీహార్‌కు చెందిన కూలీలు) తల్లిదండ్రులతో కలిసి ఓ చిన్నారి చెప్పులు లేకుండా నడుస్తోన్న దృశ్యం ఆమెను కదిలించింది. ఆ బాలిక చెప్పులు కూడా లేకుండా వెళ్తుండడాన్ని మంత్రి కొండా సురేఖ గమనించి ఎంతగానో చలించి పోయారు. వెంటనే తన కాన్వాయ్ ఆపిన సురేఖ.. ఆ చిన్నారిని కారు ఎక్కించుకొని చెప్పుల దుకాణంలోకి తీసుకెళ్లారు. దగ్గరుండి ఆ పాపకి చెప్పులు కొనిచ్చారు. అంతేకాదు, ఆ చిన్నారి చిరిగిపోయిన డ్రెస్ వేసుకుంది. దీంతో బట్టల షాపులోకి వెళ్లి ఆ పాపకు డ్రెస్సులు కొనిచ్చారు. ఆ తర్వాత పాపను ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.

ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం విదితమే. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే.. ఒక లీడర్‌కు ప్రజల మీద అమితమైన ప్రేమ ఉండాలి. అప్పుడే ప్రజా సేవ చేయగలరు. గుండెల నిండా ప్రజలపై ప్రేమను నింపుకొని ముందుకు సాగుతున్నరు కొండా సురేఖ.

1995లో రాజకీయాల్లోకి వచ్చిన కొండ సురేఖ కాంగ్రెస్ పార్టీతో తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. మొదట మండల పరిషత్ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యురాలిగా నియమితులయ్యారు. 1999లో శాయంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కొండా సురేఖ తొలిసారి విజయం సాధించారు. ఆ తర్వాత 2004, 2009 సంవత్సరాలలోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో మహిళా అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. 2014లో బీఆర్ఎస్ నుంచి వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. 2018లో జరిగిన ఎన్నికలలో పరకాలలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసే సమయంలో రాష్ట్రంలోని అన్ని రాజకీయ శక్తులు కలిసినా.. కొండా సురేఖ విశ్వసనీయతను దెబ్బతీయలేకపోయారు. 2023లో కాంగ్రెస్ పార్టీ నుంచి వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా గెలుపొందిన కొండ సురేఖ మంత్రిగా స్థానం దక్కించుకున్నారు. రాజకీయాల్లో ఒడిదుడుకులను ఎన్నో చూసిన కొండా సురేఖ ప్రత్యర్థుల గుండెల్లో వణుకు పుట్టించేలా రాజకీయాలు చేయటంలో దిట్ట. కొండా సురేఖ.. తెలంగాణ రాష్ట్ర కేబినెట్‌లో ఉన్న ఏకైక బీసీ మహిళ. రాష్ట్రంలోని యావత్ బీసీ జాతికి ప్రభుత్వం తరపున ప్రతినిధి. సాధారణంగా మన సమాజంలో మంత్రి స్థాయికి ఎదిగిన మహిళలది ఒక నేపథ్యం ఉంటుంది. ఏదో ఒక అగ్రవర్ణ కుటుంబం నుంచి రావడమో.. లేదా ఎవరో దొర కుమార్తె అయి ఉంటారు. కానీ, మంత్రి కొండా సురేఖది భిన్నమైన నేపథ్యం. సామాన్య కుటుంబంలోని ఆడబిడ్డగా పుట్టి పెరిగి అసామాన్య స్థాయికి చేరిన బీసీ శిఖరం ఆమె. బడుగు, బలహీనవర్గాలు, వెనక్కి నెట్టివేయబడ్డ జాతులకు అండగా నిలవాలన్నదే కొండా సురేఖ జెండా, ఏజెండా.

**కొండా సురేఖ** ఎదుగుదలను ఓర్వలేని కొందరు, మీడియా, సోషల్ మీడియాలో సభ్యత మరచి ఇష్టా రీతిన ప్రచారం చేసినా, మొక్కవోని దీక్షతో ప్రజా సేవలో ముందుకు కదులుతున్నారు. మన ప్రాంత ఆడబిడ్డ సురేఖమ్మపై కొందరు ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో దాడి చేస్తున్నారు. బోలగా మాట్లాడితే తప్పుబడుతున్నారు. ఇంట్లో తన మనవరాలు పుట్టినరోజు సందర్భంగా కొండా సురేఖ తన స్టాఫ్‌కి దావత్ ఇస్తే కూడా ట్రోలింగ్.. సాధారణంగా గత ప్రభుత్వంలో మంత్రులు ఫైల్స్ క్లియర్ చేయడానికి డబ్బులు తీసుకునేవారు.. తాను మాత్రం ఫైల్స్‌కి ఒక్క పైసా తీసుకోను అంటే ట్రోలింగ్.

అసలు ఎందుకు మంత్రి కొండా సురేఖను ట్రోల్ చేస్తున్నారు? వీటన్నింటికీ కారణం ఒక్కటే. అది ఏంటంటే ఆమె బీసీగా పుట్టడమేనా? తన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేయడమేనా? బీసీ వ్యతిరేకుల చేతుల్లో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్‌లు ఆమెపై నిత్యం దాడి చేయడాన్ని యావత్ బీసీ సమాజం గమనిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రత్యేక తెలంగాణలోనూ, 50 శాతంపైగా జనాభా ఉన్న బీసీలకు పట్టుమని పది శాతం సీట్లు దక్కడం లేదు. ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లోనూ బీసీవర్గానికి, అందులోనూ మహిళగా ఉన్న సురేఖ,

రాష్ట్రంలోని అన్ని రాజకీయ శక్తులు కలిసినా.. కొండా సురేఖ విశ్వసనీయతను దెబ్బతీయలేకపోయారు. 2023లో కాంగ్రెస్ పార్టీ నుంచి వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా గెలుపొందిన కొండ సురేఖ మంత్రిగా స్థానం దక్కించుకున్నారు. రాజకీయాల్లో ఒడిదుడుకులను ఎన్నో చూసిన కొండా సురేఖ ప్రత్యర్థుల గుండెల్లో వణుకు పుట్టించేలా రాజకీయాలు చేయటంలో దిట్ట.

రాజకీయాల్లో తనదైన పట్టు కొనసాగిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటివరకు బీసీ వర్గం నుంచి ఏడు సార్లు శాసనసభకు పోటీ చేసిన చరిత్ర కొండా సురేఖకు మినహా మరొకరికి లేదు. అందులో తీవ్ర భావోద్వేగంతో జరిగిన ఒక ఉప ఎన్నిక, మరో సాధారణ ఎన్నిక మినహా అయిదుసార్లు ఆమె గెలుపొందారు. ఓరుగల్లు గడ్డ మీద నుంచి రుద్రమదేవి, సమ్మక్క, సారక్క, హజారే మంగమ్మ, చాకలి ఐలమ్మ వంటి గొప్ప మహిళామూర్తులు వచ్చారు. నేడు అదే గడ్డ మీద కొండా సురేఖ పరిపాలిస్తున్నారు.

గతంలో ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో ఉమ్మడి మెదక్ జిల్లా పర్యటనకు ఆ మధ్య సురేఖ వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో స్థానిక ఎంపీ, బీజేపీకి చెందిన రఘునందన్‌రావు, అక్కడి పద్మశాలీలు తయారుచేసిన నూలు దండ సురేఖ మెడలో వేశారు. మంత్రి సురేఖను తన అక్కగా పేర్కొంటూ తాను ఆమె తమ్ముడినంటూ ఎంపీ చెప్పారు. అంత మంచి వాతావరణాన్ని సైతం ప్రతిపక్ష స్పాన్సర్డ్ సోషల్ మీడియా అసహ్యకరంగా మార్చివేసింది. అక్కా తమ్ముళ్ల బంధానికి పెడార్థాలు అంటగడుతూ తమ స్పాన్సర్డ్ వికృత సైన్యంతో విపరీతమైన దుష్ప్రచారం చేసింది. అధినేతల నుంచి ఆదేశాలు రావడమే ఆలస్యం ముందువెనుకా చూడకుండా సైకోల మాదిరి చెలరేగిపోయే వికృతసైన్యం సురేఖ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోంది. ఆడబిడ్డలను వేధిస్తున్న సోషల్ మీడియా సైకోల భరతం పట్టాల్సిన అవసరం ఉన్నది.



సాగర్ వనపర్తి
పొలిటికల్ అనలిస్టు